రేపట్నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ క్రీడలను అభివృద్ధి చేయడంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు అక్టోబరు 2 నుంచి నవంబరు 8 వరకు మూడు దశల్లో నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్లు పైబడిన యువకులే అర్హులని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయం నుంచి స్టేట్ లెవెల్ వరకు యువతీ, యువకులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని అన్నారు. కబాడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండల లెవెల్ అభివృద్ధి అధికారులు ఆయా మండలాల్లో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో క్రీడలను నిర్వహించేందుకు సచివాలయం, మండల స్థాయిల్లో అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాద రావు, చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

'జలకళ'పై నీలినీడలు

- 5,714 మంది దరఖాస్తు
- ఇప్పటివరకు 246 చోట్లే తవ్వకాలు
- 13 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు
- మూడేళ్లుగా ఎదురుచూపులు

ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకళ పథకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలోకి తీసుకొస్తామని వైసిపి ప్రభుత్వం మూడేళ్ల కిందట వైఎస్ఆర్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షనూ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత రూ.2 లక్షల వరకు చెల్లిస్తామని ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు భారం పడుతున్నా రైతులు అంగీకరించారు. అయినా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పందనరాకపోవడంతో.. అసలు పథకం ఉందా? లేదా? అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం 2020 సెప్టెంబరు 28న ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాలు నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షలోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్ఆర్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్లు పడగా, 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

విద్యుత్ కనెక్షన్లు నిలిపివేత

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర



కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని వైనాన్ని చెబుతున్న రైతు

స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 నుంచి రూ.6 లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.రెండు లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికయినా ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో విద్యుత్ శాఖ కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో మట్టి కూరుకుపోతోందని, త్వరగా తమకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఊరించి... ఉసూరుమనిపించి

చిన్న సన్న కారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. వేల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే ఈ రెండేళ్లలో వందల సంఖ్యలోనే బోర్లు తవ్వారు. పదుల సంఖ్యలోనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

ఏజెన్సీలు ముందుకు రావడం లేదు



జలకళ పథకం కోసం రైతుల నుంచి వేలాది దరఖాస్తులు వచ్చాయి. బోర్ల తవ్వకాలకు అనుమతులూ మంజూరు చేశాం. తవ్వకాల కోసం డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

- జి.వి.చిట్టిరాజు, డ్వామా పీడీ



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సొంతింటి కలతో సంతోషం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో వివిధ ప్రాంతాల్లో భూసేకరణ పెద్దఎత్తున చేపట్టి పట్టాలు అందజేసిందని, ఇళ్ల నిర్మాణంలో కూడా లబ్ధిదారులు ముందుకొచ్చి సొంతింటి కల నెరవేర్చు కుంటున్నారని, ఇటువంటి సమయంలో వారికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ శాఖలు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన 2, 4, 7, 1వ స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పద్దులపై జరిగిన చర్చలో పీడీ నక్క గణపతిరావు మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతులను సమకూర్చడంలో జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నాట్టు వివరించారు. కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదని సరుబుజ్జిలి జెడ్‌పిటిసి ప్రస్తావించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల ఆ గృహాలకు ఎవరూ వెళ్లడం లేదని, అందువల్ల తక్షణమే ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధి పనులపై జరిగిన చర్చలో చెరువు, కాలువ పనులు చేపట్టాలని సభ్యులు ప్రస్తావించారు. పనులను గుర్తించి ఎంపిడిఒలకు సమర్పించాలని పీడీ జి.వి.చిట్టిరాజు వివరించారు. ఆర్అండ్‌బి ఎస్ఒ జాన్ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న పనులను, టెండర్ల ప్రక్రియ, తదితర అంశాలపై సమాధానం ఇచ్చారు. టెక్కలి మండలం రావివలస వెళ్లే రహదారులు మరమ్మతులకు గురైందని, తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి ప్రస్తావించారు. పొందూరు, సంతబొమ్మాళి మండలాల్లో రోడ్ల దుస్థితిపై సభ్యులు ప్రస్తావించారు. తక్షణమే వాటిని మరమ్మతులు చేపట్టాలని కోరారు. కవిటి మండలం మకరంపురం మీదుగా సోంపేట బస్సు నడపాలని కోరారు. జలందరపురం నుంచి జె.శాసనం వయా గోకర్ణపురం రూట్‌లో బస్సు వేయాలన్నారు. 3వ స్థాయీ సంఘం పాలిన శ్రావణి అధ్యక్షతన జరిగింది. పశు సంవర్ధకశాఖ పద్దులపై జరిగిన చర్చలో మృతి చెందిన పశువుల లబ్ధిదారులకు బీమా పథకం రావడం లేదని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. దీనిపై జెడి కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే రూ.11 కోట్లు విడుదలైనట్టు వివరించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతున్నట్టు చెప్పారు. మరో రూ.12 కోట్ల మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్టు తెలిపారు. 5వ స్థాయీ సంఘ సమావేశం జంపు కన్నతల్లి అధ్యక్షతన జరిగింది. వీరఘట్టం మండలం కత్తులకవిటిలో అంగన్వాడీ కేంద్రం-1 శిథిలావస్థలో ఉందని జెడ్‌పిటిసి ప్రస్తావించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రచారభేరి కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ, పోస్టర్లను పంచుతూ ప్రచారం చేపట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలోను, నిత్యావసర ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు విమర్శించారు. ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా నగరంలోని దమ్మలవీధిలో ప్రచారం చేపట్టి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు, బడాబాబులకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ... ప్రజలపై భారాలు వేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి భవిష్యత్ తరాలకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఈ విధానాలను వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అధిక ధరలు తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన దళితులకు, గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4 వరకు నిర్వహించనున్న సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.సూరయ్య, ఎల్.మహేష్, ఎం.ఎర్రయ్య, కృష్ణ, బి.పుణ్యవతి, రామారావు, కె.ప్రభావతి, సిహెచ్.పోలమ్మ, కృష్ణవేణి, లక్ష్మి, రాజేశ్వరి, కుసుమ, ఎ.రాంబాబు, రత్నం పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : అధిక ధరలను నియంత్రించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న ఎచ్చెర్లలో ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు

పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఎచ్చెర్ల మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన సమరభేరిలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు డి.బంగా రాజు, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు భాస్కరరావు, ఇంధన రమణ, సురేష్, మహేష్, చిరంజీవి, నాగరాజురాజశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు వేగవంతం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- జలుమూరు

జగనన్న ఇళ్ల కాలనీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చల్లవానిపేటలోని చల్లవానిపేట, లింగాలవలస జగనన్న కాలనీలను గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ముఖద్వారం, బిటి రోడ్డు, గ్రావెల్ రోడ్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. కాలనీలో అవసరమైన చోట్ల సిసి రోడ్లు నిర్మించేందుకు ఎస్టిమేషన్ వేసి పంపిస్తే నిధులను మంజూరు చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న ఇళ్ల కాలనీకి ముందు ఖాళీగా ఉన్న స్థలాన్ని చూసి ఆ స్థలం పొజిషన్‌పై తహశీల్దార్ బి.సత్యంను అడిగి తెలుసుకున్నారు. ఇది డీపట్టా భూమేనని చెప్పారు. అయితే కాలనీలోని పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఈ స్థలాన్ని ఉపయోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎంపిపి వాన గోపి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, హౌసింగ్ పీడీ నక్క గణపతిరావు, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, హౌసింగ్ డిఇలు డి.రామ్మూర్తి, కె.అప్పారావు, ఇఒపిఆర్‌డి పి.ఉమామహేశ్వరరావు, మండల ఇంజినీర్ కె.శ్రీధర్, మండల సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, చిన్నాల మురళి, పొన్నాన విజయ్ కుమార్, కరుకోల హరిప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

మనువాద శక్తుల అండతో మహిళలపై దాడులు

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలపై జరుగుతున్న దాడులకు సంఘటితంగా ప్రతిఘటించడం ద్వారానే అడ్డుకోగలమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐద్వా నాయకులు లక్ష్మి 32వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై హింస ప్రతిఘటన అన్న అంశంపై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మహిళలపై దాడులు అకృత్యాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో దాడులు పెరుగుతున్నాయని, ఈ దాడులను మనువాద శక్తులు అండగా నిలుస్తూ మహిళలపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఐక్యతతో ఎదుర్కోవాలన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న రోలింగ్‌ను నివారించే మార్గాలు కనుక్కోవాలన్నారు.

ఒకవైపు భారత మాతాకీ జై అంటూనే... భారత మహిళలపై దాడులు చేయడం అన్యాయమన్నారు. మహిళలు కేవలం వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. మహిళా సంఘం జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి మాట్లాడుతూ గృహహింస మొదలు సామూహిక దాడులు, అత్యాచారఘటనలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ ఇంటా, బైటా ఎంతో చాకిరి చేస్తున్న మహిళలకు గుర్తింపు లేదన్నారు. ఐద్వా నాయలకులు శ్రీదేవి పాణిగ్రహి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, డిగ్రీ కాలేజ్ తెలుగు విభాగా అధిపతి జ్యోతిలక్ష్మి, బాటనీ లెక్చరర్ ఎస్.రుద్రమరాణి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం జిల్లా అధ్యక్షులు వి.జి.కె.మూర్తి, లక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నేతలే ఇసుకాసురులు

- ఉచితం పేరుతో రూ.4 వేల కోట్లు దోచుకున్నారు
- అడ్డుకున్న అధికారులను కొట్టిన చరిత్ర వాళ్లదే
- వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రజలకు అత్యంత పారదర్శకంగా, అందుబాటు ధరలో ఇసుకను అందజేస్తున్న తమ ప్రభుత్వంపై టిడిపి నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... టిడిపి హయాంలో ఆ పార్టీ నాయకులు రూ.4 వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. వారి హయాంలో ఇసుక ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో చెప్పలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అసలైన ఇసుకాసురులు వారేనని విమర్శించారు. అక్రమ తవ్వకాలను అడ్డుకున్న వనజాక్షి అనే తహశీల్దార్‌ను జుట్టు పట్టుకొని కొట్టిన చరిత్ర వారికే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా తమ ప్రభుత్వం ఇసుక టెండర్ల ప్రక్రియను నిర్వహించి ఏటా ప్రభుత్వానికి రూ.760 కోట్ల ఆదాయాన్ని తీసుకు వస్తున్నదని స్పష్టం చేశారు. ప్రత్యేకమైన టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసి ఇసుక విధానంలో



కృష్ణదాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు

ఎలాంటి లోపాలు ఉన్నా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. సెబ్ లాంటి నిఘా వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఒక ఐపిఎస్ అధికారిని నియమించి ఎక్కడా అక్రమాలు జరగకుండా చూస్తున్న తమ ప్రభుత్వంపై నిందారోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

యువగళానికి సంఘీభావం

- జిల్లాలో పలు చోట్ల ర్యాలీలు
- టిడిపి ప్రభంజనం ఖాయం
- ఎంపి రామ్మోహన్‌నాయుడు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో పలుచోట్ల సంఘీభావ ర్యాలీలు చేపట్టారు. పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాల్లో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఆమదాలవలస నియోజకవర్గంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్, పలాసలో నియోజవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష, శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్తేజ పరిచారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్ గారంటీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం నుంచి సంతబొమ్మాళి మండల కేంద్రం వరకు నిర్వహించిన సంఘీభావ పాదయాత్రలో ఎంపి రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అరాచకత్వం భూకబ్జాలు పెరిగాయని, అభివృద్ధి లేదని విమర్శించారు. టిడిపి చేసిన పనులకు ఇప్పుడు నాయకులు పేర్లు మార్చుకుని శిలాఫలకాలు పెట్టుకుంటున్నారని విమర్శించారు. టెక్కలి నియోజకవర్గం రానున్న ఎన్నికల్లో మళ్లీ టిడిపి జెండా ఎగుర వేసి అచ్చెన్నాయుడు హ్యాట్రిక్ సాధించబోతున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, బోయిన రమేష్, బగాది శేషగిరి పాల్గొన్నారు. పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండల కేంద్రంలో నియోజవర్గ ఇంఛార్జి కలమట వెంకటరమణతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కూన రవికుమార్

ఆమదాలవలస మండల కేంద్రం పూజారిపేటలోని వెంకటేశ్వర కళ్యాణ మండపం నుంచి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవివకుమార్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎంఎల్‌సి పీరుకట్ల విశ్వప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, మొదలవలస రమేష్, అంబళ్ల రాంబాబు, తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, సరేష్ పాల్గొన్నారు.

రానున్నది టిడిపి ప్రభుత్వమే : గుండ లక్ష్మీదేవి

రాష్ట్రంలో వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో టిడిపి ప్రభంజనం సృష్టించడం ఖాయమని శ్రీకాకుళం నియోజవర్గ ఇంఛార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. శ్రీకాకుళం మండలం పెద్ద పాడు నుంచి సింగుపురం ప్రశాంతి నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రం సర్వ నాశనం:గౌతు శిరీష

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం సర్వనాశమైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు.మామిడిపల్లి నుంచి పెద్ద నీలావతి వరకు ర్యాలీ చేపట్టారుకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

9న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- పలాస

జీడిపిక్కల గిట్టుబాటు ధర కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సెప్టెంబరు 9న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పలు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో దేశభక్తి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శాలిని వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు, ప్రజాసంఘాలు, జీడిపిక్కల రైతు సంఘాలు పాల్గొని వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నాయకులు పత్తిరి దానేష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక ఉద్యమాల ద్వారానే జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కొనుగోలు కేంద్రాలు సాధ్యపడతాయన్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు రానున్న ఎన్నికల మేనిఫెస్టోలో జీడి గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు, జీడిపిక్కల కార్పొరేషన్ను ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని, తద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు రామారావు, దుశ్యంత్, వినోద్ లు మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాల ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని, జీడిపిక్కలకు గిట్టుబాటు ధర సాధ్యపడుతుందని అన్నారు. ప్రజాకళామండలి సభ్యులు నీలకంఠం, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు అరుణ, రైతాంగ సాధన కమిటీ సభ్యులు శ్రీరాములు ప్రసంగించారు. 9న విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

ఇసుకపై రవికుమార్ వ్యాఖ్యలు విడ్డూరం

ఆమదాలవలస : టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ కూన రవికుమార్ ఇసుక కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ అన్నారు.గురువారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో విలేకరుల మాట్లాడుతూ ఇసుక బకాసురుడు రవికుమార్ ఇసుక అక్రమాల కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014 – 19 మధ్య కాలంలో టిడిపి హయాంలో రాష్ట్రంలో ఇసుక మాఫియాకు కేరాఫ్ అడ్రస్ బ్రాండ్ అంబాసిడర్ రవికుమార్ అని, అటువంటి వ్యక్తి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీ మీద ప్రభుత్వం పైన అప్రాజ్యంగా మాట్లాడడమేంటని ఎద్దేవా చేశారు. సింగూరు ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లి నానా హంగామా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. టిడిపి హయాంలో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ఇసుక ర్యాంపు పరిధిలోని వంశధార నదిలో ఆనాడు జెసిబిలు, ఇసుక లారీలు వరద నీటిలో కూరుకుపోయిన సంగతి మరిచారా లేక అవే వాహనాలు సింగూరు ర్యాంపులో తేలుతాయని వెతకడానికి వచ్చారా అని వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో నాయకులు సువ్వారి అనిల్ కుమార్, పేడాడ వైకుంఠరావు, కొంచాడ ఎంపిటిసి ప్రతినిధి సూర్యారావు, రాపాక ఎక్స్ ఎంపిటిసి సూర్యారావు, మన్మథరావు, శ్రీను, పైడి విజయ్ పాల్గొన్నారు.

కొనసాగిన లేఖరుల పెన్‌డౌన్

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం తీసుకువచ్చిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ పొందూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం రెండోరోజు కూడా దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేస్తూ తమ నిరసనను తెలిపారు. ఈ విధానంతో దస్తావేజు లేఖర్లు, డిటిపి ఆపరేటర్లు తమ జీవనభృతిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ రవిశంకర్ శేషుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘం జిల్లా అధ్యక్ష, జనరల్ కార్యదర్శి పైడి రాంప్రసాద్, బలివాడ సత్యనారాయణ, దస్తావేజు లేఖర్లు సూర శ్యామలరావు, కావల ప్రసాదరావు, వి.ఎస్.పట్నాయక్, అశోక్, రవి, టంకాల గిరి, జాడ మురళి, చిట్టిరి గోవింద, వి.టి.నాయుడు పాల్గొన్నారు.


పొందూరు : నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశ పెట్టబోతున్న కార్డు ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖరులు, స్టాంప్స్ అమ్మకందారులకు మనుగడ లేదని సబ్ రిజిస్ట్రారు కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలుపూ పెన్‌డౌన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎలమంచిలి రామారావు, శాసనపుపతి లవకుమార్, అప్పాల శివప్రసాద్, బుడతకాయల అభిలాష్, దోగాన నీలాచలం, శాసనపుపతి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని 2023 సెప్టెంబర్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ పెన్ డౌన్ చేశారు. దీనివల్ల దస్తావేజు లేఖర్లకు, స్టాంపు వెండర్లకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మా సమస్యను రాష్ట్రప్రభుత్వం దష్టికి తీసుకొని వెళ్లి తగిన న్యాయం చేయాల్సిందిగా సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు కూర్మయ, ఉప్పాడ సోమేశ్వర రావు, జగదీష్, కె. వేంకట రమణ, మోహన్ రావు, పవన్ కుమార్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా 'ఉన్నతి'

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి పథకంతో మహిళలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఉన్నతి పథకం ప్రవేశ పెట్టిందని, ఇప్పటి వరకు 575 సభ్యులకు రూ. 77 కోట్లు రుణాలు మంజూరు చేశామని డిఆర్ డిఎ పీడీ విద్యాసాగర్ తెలిపారు. పలాస స్త్రీ నిధి భవనంలో జెకెపి అధ్వర్యాన సోంపేట క్లస్టర్ పరిధిలోని ఎపిఎంలు సిసిలు అకౌంటెంట్లతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సుమారు రూ. 4 లక్షల వ్యయంతో ఆటోలు కొనుగోలు చేసి పంపిణీ చేశామని అన్నారు. ఇచ్చిన రుణాలకు సున్నా శాతం వడ్డీ అని చెప్పారు. స్త్రీ నిధి రుణాలకు సంబంధించి సోంపేట క్లస్టర్ పరిధిలో 6,600 సభ్యులకు రూ. 33 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 2,735 మంది సభ్యులకు రూ. 15 కోట్లు రుణాలు మంజూరు చేశామని చెప్పారు. క్లస్టర్ పరిధిలో రూ. 18.76 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, రూ.16.72 కోట్లు వసూలు చేశామని తెలిపారు. క్లస్టర్ పరిధిలో 10045 డ్వాక్రా సంఘాలు ఉండగా, అందులో 6504 గ్రేడ్–ఎ, 3002 గ్రేడ్–బి, 510 గ్రేడ్–సికు ఎంపిక చేశామని, ఎ–గ్రేడ్‌కు రూ. 20 లక్షలు, బి–గ్రేడ్ కు రూ.15 లక్షలు, సి–గ్రేడ్‌కు రూ. 10 లక్షలు చొప్పున బ్యాంకు రుణాలు మంజూరు చేశామని చెప్పారు. ఇక నుంచి రుణాలు వసూలు చేసేందుకు పే టిమ్ ద్వారా సెల్ ఫోన్ యాప్ సిసిలు, సిఎఫ్‌లకు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సోంపేట ఏరియా కో-ఆర్డినేటర్ కె.మోహనరావు, స్త్రీ నిధి ఎజిఎం సత్యనారాయణ, లైవ్ స్టాక్ డిపిఎం డాక్టర్ సన్యాసిరావు, ఉన్నతి డిపిఎం శ్రీధర్, ఐటి డిపిఎం కళ్యాణ్ చక్రవర్తి, జీవనోపాధి ఎపిఎం ఈశ్వరరావు, జిల్లా ఎల్‌సి కో–ఆర్డినేటర్ బసవరాజు, పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ఎపిఎంలు మల్లేశ్వరరావు, జాంబవతి, గోవిందరావు, ప్రసాదరావు, రవణమ్మ, ఉమారాణి, స్త్రీ నిధి మేనేజర్ రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాసాగర్

రైతులకు అవగాహన

లావేరు : ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్లాంట్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని మండలంలోని కొత్తకోటలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన శాస్త్రవేత్త కిరణ్ మొక్కజొన్న, పత్తి, వరి పండించే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పత్తిలో వచ్చే సూక్ష్మదాసు లోపాలు, కాయ తొలిచే పురుగు, గులాబీ రంగు పురుగు యాజమాన్యం గురించి సూచనలు అందజేశారు. వరిలో పటాస్ దాతలు సవరణ గురించి పేర్కొన్నారు. మొక్కజొన్నలు వడలు తెగులు గురించి, దాని నివారణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ తిరుమలరావు, సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాత్రవేత్త కిరణ్

మూడు వార్డుల నీటి సమస్యకు చెక్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఒకటి, రెండు, మూడు వార్డుల్లో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా మూడు నెలలపాటు టాంకర్ ద్వారా నీరు అందించేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం మున్సిపల్ చైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. రూ.16 లక్షలతో వివిధ వార్డుల పరిదిలో సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆ 22వ టీడీపీ వార్డులో ప్రజ బాని చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించి కౌన్సిల్ ఆమోదం కోరగా కౌన్సిల్ సభ్యులంతా ఆమోదం తెలిపినప్పటికీ వైసిపికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వార్డుకు సంబంధం లేని వ్యక్తిగా అడ్డుచెప్పటం ఏమిటని వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. స్పందించిన కమీషనర్ ఎన్. రమేష్ ప్రజలకు ఉపయోగపడే బావికోసం నిధులు కేటాయించామని తెలిపారు. అనంతరం ఎజెండాలో పొందిపరిచిన పలు అంశాలు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కౌన్సిల్ సభ్యులంతా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో మున్సిపాల్టీలో కోతులు పెరిగిపోతున్నాయని, ఇందుకోసం రూ2 లక్షలు నిధులు కేటాయించి కౌన్సిల్ ఆమోదం కోరగా కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అయితే ఆ కోతులను చంపకుండా కొండ ప్రాంతాల్లోకి తరలించాలని వైస్ చైర్పర్సన్లు లాబాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్యలు కోరారు. స్పందించిన చైర్పర్సన్ కౌన్సిల్ తీర్మానాన్ని ఫారెస్ట్ అధికారులకు పంపించి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.


త్రినాథరావు మృతదేహం
(ఇన్‌సెట్‌లో త్రినాథరావు, ఫైల్)

రోడ్డు ప్రమాదంలో కొత్తూరు జెడ్‌పిటిసి భర్త మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగపురం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు జెడ్‌పిటిసి కామాటి భాగ్యవతి భర్త కె.త్రినాథరావు (55) మతి చెందినట్లు ఎస్‌ఐ టి.రాజేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు మండలం కుంటిభద్రకు త్రినాథరావు ద్విచక్ర వాహనంపై టెక్కలి వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా... జలగలింగపురానికి చెందిన మామిడి భాగ్యం అనే మహిళను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో త్రినాథరావు తలకు బలమైన గాయం కాగా, భాగ్యం స్వల్పంగా గాయపడింది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృత్యువాత పడినట్లు ధ్రువీకరించారు. భాగ్యం చికిత్స పొందుతుంది. మృతుడికి భార్య భాగ్యవతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. త్రినాథరావు మృతితో కొత్తూరు మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి: జాతీయ రహదారి నిమ్మాడ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురకు గాయాలయ్యాయి. నరసన్నపేట నుంచి పలాస వెళ్తున్న ఆర్‌టిసి బస్సు నిమ్మాడ వద్ద టిక్కెట్లు ఎక్కించుకొని వెళ్తుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బస్సుకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక సీటులో ఉన్న నరసన్నపేటకు చెందిన తంగుడు సంగీత, వజ్జ గోపాలరావు, లక్ష్మణరావులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి స్థానిక 108 సహాయంతో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూరిళ్లు దగ్ధం

కవిటి : కవిటి మండలం నెలవంక గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన పీత బైరమ్మ అనే వ్యవసాయ కూలీ ఇంట్లో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో పక్కపక్కనే ఉన్న రెండు పూరిల్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం, స్థానికులు స్పందించి మంటలు ఆర్పేలోగా రెండు పూరిల్లు పూర్తిగా కాలియిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని, రెక్కాడితే గానీ డొక్కాడని తనకు ప్రభుత్వమే ఆదుకోవాలని బైరమ్మ బోరున విలపిస్తోంది. సంఘటన స్థలాన్ని వీఆర్వో దివాకర్ పరిశీలించి బాధితులకు అవసరమైన సరుకులు అందించారు. పూర్తిస్థాయి నివేదికను తహశీల్దార్ శేఖర్‌కు అందిస్తానని తెలిపారు.

ఎలక్ట్రికల్ వాహన తయారీపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న అరుణ్ మనోహర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సిఎంస్ ఎక్సెన్స్ కేంద్రంలో బిటెక్ ఫైనల్ ఇయర్ మెకానికల్ విభాగంలో విద్యాభ్యాసం చేస్తున్న 210 మంది విద్యార్థులకు ఎలక్ట్రికల్ వెహికల్ మేనిఫేక్చరింగ్పై 'ఏ హేండ్స్ ఆన్ ప్రాక్టికల్ అప్రోచ్' అనే అంశంపై ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. సబ్సిస్టమ్ ఆఫ్ ఇవి, చాసిస్ అండ్‌ఎక్స్రస్, స్టీరింగ్ అండ్ సస్పెన్షన్ సిస్టమ్, పవర్ ట్రైన్ వైరింగ్ అండ్ హార్న్స్, ఈ వి మోటార్స్ అండ్ ఎనర్జిటిక్ డైమెన్షనింగ్, ఫైనల్ అసెంబ్లీ, క్యూసి అండ్ టెస్టింగ్ అనే సబ్జెక్టపై రిటన్ స్మార్ట్ మేనిఫేక్చరింగ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ, సిఇఒ డాక్టర్ అరుణ్ మనోహర్ గుర్రం, ప్రొడక్షన్ ఇంజినీర్ మనోహర్ తియోడర్లు శిక్షణ ఇస్తున్నట్టు డైరెక్టర్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్చిడి డాక్టర్ డి.శ్రీరాములు, ఎపిఎస్ఎస్‌డిసి స్పాక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, మెకానికల్ విభాగ కో–ఆర్డినేటర్ డి.రఘువీర్ పర్యవేక్షిస్తున్నారు.

ఆ స్థలం గ్రామకంఠమే

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రణస్థలం రెవిన్యూ పరిధిలోని గ్రామకంఠ స్థలం కోర్టు వివాదంలో ఉన్నందున ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లరాదని, ఆ స్థలంలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని రెవిన్యూ, గ్రామపంచాయతీ అధికారులు బహిరంగ నోటీసు బోర్డుని గురువారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో జే.ఆర్.పురం రావాడ రోడ్డులో రణస్థలం రెవిన్యూ పరిధి సీఐ కార్యాలయానికి వెనుక విలువైన 13 సెంట్లు భూమికి సంబంధించి రెవెన్యూ శాఖ గ్రామకంఠం భూమిగా నిర్ధారణ చేసి రెవెన్యూ శాఖ భూమిని పంచాయతీ కార్యదర్శి కి అప్పగిస్తూ నోటీసులు అందజేశారు. అయితే ఆ స్థలం తమదేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు ఆక్రమించే ప్రయత్నం చేశారు, దీన్ని స్థానికులు బుధవారం అడ్డుకోవడం పెద్ద దుమారం రేగింది. ఈ నేపథ్యంలో వివాద స్థలంలో విద్యుత్ మీటర్ పెట్టేందుకు పంచాయితీ కార్యదర్శి అనుమతి ఇవ్వడంతో విద్యుత్ శాఖ అధికారుల మీటర్‌ను ఏర్పాటు చేశారు, స్థానికులు కొంతమంది ఆందోళన చేయడంతో మీటరుకిచ్చిన అనుమతులను తిరిగి రద్దు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విద్యుత్ అధికారులకు నోటీస్ ఇవ్వడం, ఆ నోటీసు ప్రకారం విద్యుత్ శాఖ అధికారులు ఆ మీటర్లు తొలగించడం. ఆ స్థలంలో వేసినటువంటి ఫెన్సింగ్ పోళ్లను స్థానికులు ఇరగ కొట్టడంతో వివాదం ఏ స్థాయికి దారితీస్తుందోనని స్థానికుల ఆందోళన చెందారు. దీన్ని గమనించిన అధికారులు ఆ స్థలంలోకి ఎవరూ వెళ్ళవద్దని నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. రణస్థలం వీఆర్‌ఓ వై జగన్నాథం, జే.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతో వివాదం కొలిక్కి వచ్చినట్టయింది. కోర్టు తీర్పు అనంతరం ఆ స్థలం ఎవరికి చెందితే వారు వెళ్లాలి తప్ప అంతవరకు ఆ స్థలంలోకి వెళ్ల వద్దని ఆ నోటీసులో ఉంది.


హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఇంజినీరింగ్ విద్యను క్రమశిక్షణతో చదువుకుని మంచి పౌరులుగా తయారై తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్, శ్రీకాకుళం కార్యనిర్వహణ ఇంజినీర్ డాక్టర్ పి.సుగుణాకరరావు అన్నారు. స్థానిక చిలకపాలెంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ చేరిన విద్యార్థులకు ప్రేరణ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు వ్యక్తిత్వ వికాసానికి, సంస్కృతి, విద్యా విధానం, మంచి నడవడక, ప్రణాళికాబద్ధంగా ఎలా నడుచుకోవాలో, స్వయంగా ఎదిగే గుణం అలవర్చు కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు కె.శ్రీనివాసరావు, పి.దుర్గాప్రసాద్‌రాజు, డి.వెంకటరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రాజ్‌కిరణ్, చంద్రశేఖర్, సునీల్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం సుగుణాకరరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.


జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

నేత్ర వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని.గురండి పంచాయితీ దసరదీపురం గ్రామంలో వై.ఎస్.ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మెట్టూరు పి.హెచ్.సి పరిధిలో గురువారం ఆప్తాల్మిక్ వైద్యాధికారి ఐ. జానకి రామయ్య ఆధ్వర్యంలో 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏడుగురికి అంతర్ కుసమాలు ఉన్నట్లు గుర్తించాగా, 21 మందికి దష్టి లోపం.ఉన్నట్లు వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. ఇందులో 20 మందికి సాధారణ జబ్బులుండగా వీరికి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కష్ణ వేణి, రాజులమ్మలు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని లక్కపురం గ్రామంలో ఎంపీపీ కర్నేన దీప నేతత్వంలో పాలకొండ శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లక్కపురం, పనుకుపర్త, పాలవలస, మర్రిపాడు పరిసర గ్రామాల నుంచి అనేక మంది వ్యాధిగ్రస్తులు హాజరయ్యారు. డాక్టర్లు సాయి శంకర్, డాక్టర్ పరిమళ, 142 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు, షుగర్ బీపీ వంటి వైద్య పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో విజయ ఆసుపత్రికి సంబంధించి ఎ.ఎన్.ఎంలు, వైద్య సిబ్బంది పి.ఆర్. ఒలు సహకరించారు. స్థానిక సర్పంచ్ వియ్యాపు విజయలక్ష్మి మాజీ సర్పంచ్ కృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులు నాగేశ్వరరావు, శంకర్రావు, వాసుదేవరావు, సత్యసాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


బూర్జ : మందులను పంపిణీ చేస్తున్న కృష్ణ

12మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు మోమోలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో బుధవారం నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ సమీక్షకు హాజరుకాని 12 మంది ఫీల్డు అసిస్టెంట్లకు మోమోలను జారీ చేసినట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వారమూ నిర్వహించే ఈ సమావేశానికి ఫీల్డు అసిస్టెంట్లు హాజరుకావాల్సి ఉందన్నారు. మండలంలోని బొడ్డేపల్లి, బురిడికంచరాం, దల్లవలస, దల్లిపేట, గోకర్ణపల్లి, కనిమెట్ట, కింతలి, కోటిపల్లి, నందివాడ, పిల్లలవలస, తోలాపి, ధర్మపురం గ్రామాలకు చెందిన ఫీల్డు అసిస్టెంట్లకు మోమోలను జారీ చేసినట్లు చెప్పారు. అలాగే జూన్ 26 నుంచి పనిచేసి పనులకు అందని కూలీలకు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నట్లు చెప్పారు. ఈయనతో పాటు ఎపిఒ పి.శ్రీనివాసరావు ఉన్నారు.


మహిళతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సంక్షేమ పాలనతో ప్రజల కళ్ళలో వెలుగులు విరజిల్లుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలంలోని బెలమాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది లేనిది లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా మనసున్న మనసుతో పరిపాలనను కొనసాగిస్తూ గడప వద్దకే సుపరిపాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనుగుల కిషోర్, స్థానిక వైసిపి నాయకులు బెండి గాంధీ, సీపాన మల్లేష్, రగోటి అప్పల నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు, సచివాలయం సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు 'మనుస్' అండ

ప్రజాశక్తి- నౌపడ/పోలాకి

పోలాకి మండలం గుప్పెడుపేటకు చెందిన మత్స్యకారుడు చెక్క రాజారావు, చెల్లెమ్మ దంపతుల కుమారుడు గోవిందు గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతుండేవాడు. కుమారుని వైద్యం కొరకు ఆరు నెలలుగా పలుమార్లు శ్రీకాకుళం, విశాఖపట్నంలో పలు ఆస్పత్రిలకు తిరిగారు. అక్కడ బాధితుడు గోవిందకు గుండెలో రంధ్రాలు ఉన్నాయని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. చేసేదేమీ లేక తీవ్ర ఆవేదన చెందారు. విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రి బాధితుడికి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేసి వైద్యం చేయించుకోవాలని సూచించారు. దీంతో ఊరు కాని ఊరు వెళ్లి నాలుగు రోజులు ఆస్పత్రి మెట్లపైనే గడిపారు. ఓ పక్క కుమారుని ఆరోగ్యం ఆందోళనకు గురి చేస్తుంటే తీవ్ర మనోవేదనకు గురయ్యారు. వీరి దీనగాదను చూసిన కొందరు మానవతావాదులు హైదరాబాదులోని 'మనుస్' స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇచ్చారు. వీరి దిన పరిస్థితి చూసిన సంస్థ ప్రతినిధులు చెలించి పోయారు. వెంటనే ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడికి అవసరమయ్యే అన్ని పరీక్షలు చేయించారు. గుండె శస్త్ర చికిత్సకు, మందులు, వైద్య ఖర్చులు వారే ఏర్పాటు చేశారు. నెల రోజులు పాటు వారి కుటుంబానికి భోజనం, వసతి కల్పించారు.


చికిత్స పొందుతున్న గోవిందు


రాఖీలు కడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనుబంధానికి ప్రతీక రాఖీ

ప్రజాశక్తి- కవిటి

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి లత ఎమ్మెల్యే అశోక్‌కి రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం అన్నా చెల్లెళ్ల అనుబంధం, రాఖీ పౌర్ణమి విశిష్టతను బ్రహ్మకుమారి లత వివరించారు. ఈ కార్యక్రమంలో బెందాళం కష్ణమూర్తి, మొగిలిపురి సీతాలు, అనుపోజు కుమారస్వామి, వజ్జ బాబురావు, అనూపోజు లక్ష్మీనారాయణ, అనుపోజు యోగి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండల మహిళా సమాఖ్య సిబ్బంది రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. గురువారం ఉదయం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎంగా పని చేస్తున్న పైడి కూర్మారావుకు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి రాఖీ కట్టి మండలంలోని మహిళలందరి తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లాలోని జంగారెడ్డి గూడెంలో యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత రక్షా బంధన్ సందర్భంగా రాఖీ కట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మహిళలు పాల్గొన్నారు.

పలాస : రక్షాబంధన్ సందర్భంగా సోదరిల మధ్య అనుబంధానికి గుర్తుగా పండుగను జరుపుకుంటారని, అందరికన్నా వినూత్నంగా మొక్కలను రక్షిస్తామంటూ పలాస మండలం బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హరిత దళ క్లబ్, జూనియర్ రెడ్ క్రాస్‌ల ఆధ్వర్యంలో వక్ష రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేశారు. ఈ ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, ఎన్జీసి క్లస్టర్ కోఆర్డినేటర్ సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రాఖీ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన గురువారం నగరంలోని పలు కూడళ్లలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. వన్ టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు, కానిస్టేబుళ్లు, టూ టౌన్ ఎస్‌ఐ గణేష్, సిబ్బంది, డిఎస్‌పి కార్యాలయం, ఎస్‌పి కార్యాలయం సిబ్బందికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షులు డి.చందు, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, తిరుపతి, రేవతి, జ్యోతి, హారిక పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని మండలంలో ప్రజలు పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. రక్షాబంధన్ అంటే చెల్లెల్లు అన్నయ్యకు అక్కలు తమ్ముళ్లకు రాఖీ కట్టి నువ్వే మాకు రక్ష అని చెప్పడం పండుగ ముఖ్య ఉద్దేశం. చిన్నతనం నుండే తల్లిదండ్రులు ఈ రక్షాబంధాన్ విశిష్ట తెలియజేస్తూ సోదరీ మణులు సోదరులకు రాఖీ కట్టే విధంగా పిల్లలకు తెలుగు సంప్రదాయాలను తెలియజేశారు.


ఎమ్మెల్యే అశోక్ కి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి లత


మధుసూదన్‌కు రాఖీ కడుతున్న విశాఖ స్కూల్ విద్యార్థినులు


బంగారు వస్తువులను అందజేస్తున్న పోలీసులు

ఆటో డ్రైవర్ నిజాయితీ

8 తులాల బంగారం అందజేత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జోగి కృష్ణ అనే ఆటో డ్రైవర్ గురువారం టెక్కలిలో తన నిజాయితీని చాటుకున్నాడు. మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామానికి చెందిన రవిశంకరరావ గురువారం తన కుటుంబంతో కలిసి బొప్పాయిపురం గ్రామం వద్ద ఆటోఎక్కి స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద దిగి పోయాడు. ఆ సమయంలో ఆటోలో 8 తులాలు బంగారం కలిగిన బ్యాగును మరచిపోయి దిగిపోయారు. బాధితులు టెక్కలి పోలీస్ స్టేషను ఆశ్రయించారు. ఆటో బ్యాగును మరచిపోయిన విషయం గుర్తించి ఎస్‌ఐ ఎల్. రామకృష్ణకు అందజేశాడు. అప్పటికే ఫిర్యాదు చేసిన బాధితుడిని పిలిపించి బంగారు ఆభరణాలను అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీకి పోలీసులతో పాటు పలువురు స్థానికులు అభినందించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ టెక్కలి ఆది ఆంధ్రా వీధిలో ఎస్‌సి కమ్యూనిటీ హాలుకు టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల నిధులు నుంచి రూ.పది లక్షల వ్యయంతో ఎస్‌సి కమ్యూనిటీ భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతుందని, సంక్షేమానికే ప్రజలు పట్టడం కడతారని అన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

43rd Years ANNIVERSARY

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

పలాస డివిజన్

శుక్రవారం 01-9-2023 12 పేజీలు





ప్రజల పక్షాన

అక్షర సమరం

42 సంవత్సరాల క్రితం... 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా రూపుదిద్దుకొని తెలుగు పాఠకలోకం ముందుకొచ్చింది. అంచెలంచెలుగా విస్తరించి ఎనిమిది కేంద్రాల నుంచి ప్రచురితమవుతోంది. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలకూ ప్రజాశక్తి వార్తా సేకరణ యంత్రాంగం విస్తరించి, ప్రజా సమస్యలపై అక్షర బాణాలు సంధిస్తూ సమరం చేస్తోంది. పత్రికారంగం భారీ పెట్టుబడులమయమైపోయిన ఈ కాలంలో, ఆ పోటీని తట్టుకొని మున్ముందుకు సాగుతోంది. సుందరయ్య, ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్, బి.టి రణదివే, మోటూరు హనుమంతరావు వంటి మహా నాయకులు నాటిన మొక్కే నేడు శాఖోపశాఖలుగా విస్తరించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం


ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా ఉండాలనేది ప్రజాశక్తి లక్ష్యం. ప్రత్యామ్నాయ జర్నలిజం దాని ఊపిరి. దోపిడీరహిత సమాజ నిర్మాణంలో తన వంతు పాత్ర నిర్వహించడం దాని కర్తవ్యం. శ్రామికవర్గానికి, పీడిత తాడితులకు గళం అది. అభివృద్ధి కాముకులకు, అభ్యుదయవాదులకు కరదీపిక. ప్రజాస్వామ్య పరిరక్షణకు, లౌకిక విలువల పరిరక్షణకు ప్రజాశక్తి ఎప్పుడూ ముందుపీఠిన ఉంటూ వచ్చింది. నియంతృత్వ పోకడలను నిర్భయంగా ఎండగట్టింది. వారపత్రికగా ఉన్న కాలంలో అత్యయిక పరిస్థితికి ఎదురొడ్డి నిల్చింది. దినపత్రికగా పరివర్తన చెంది వేళ్లూనుకొంటున్న కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమైన పరిణామం సంభవించింది. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా రద్దు చేసింది. నాటి కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడను ప్రతిఘటిస్తూ సాగిన ఉద్యమంలో ప్రజాశక్తి తన వంతు పాత్రను నిర్వహించింది. అప్రజాస్వామిక చర్యలను ప్రతిఘటించడంలో ఎప్పుడూ వెన్నుచూపలేదు. ఎమర్జెన్సీలో ప్రజాశక్తి వారపత్రికకు సంపాదకుడిగా ఉన్న మోటూరు హనుమంతరావును అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఎంతో ప్రయత్నించింది నాటి ప్రభుత్వం. ఆయన అజ్ఞాతంలో ఉంటూనే పత్రికను నిర్వహించారు.

దోపిడీ విధానాలపై అక్షర ధ్వజం

ప్రపంచీకరణ పేర సాగుతున్న దారిద్రీకరణ విధానాలను ఎండగట్టడంలో ప్రజాశక్తిది ఎప్పుడూ ముందంజే. (మిగతా...2లో)











ప్రజల పక్షాన అక్షర సమరం

(మొదటి పేజీ తరువాయి)


ప్రపంచ బ్యాంకు విధానాల పర్యవసానాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తెస్తోంది. విద్య, వైద్యం, విద్యుత్, నీటిపారుదల ఇలా ప్రతి రంగంలోనూ ప్రపంచబ్యాంకు ప్రవచిత విధానాలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమితాసక్తి చూపెట్టాయి. ఈ విధానాల వల్ల అన్ని రంగాల్లోనూ ప్రజలపై భారాలు పెరిగాయి. ప్రయివేటీకరణ ఫలితంగా విద్యా, వైద్యాలు వ్యాపార సరుకులయ్యాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు లబ్ధిదారులకు ఎలా ఉపయోగపడ్డాయనేది వివరంగా వివరించింది. అందులోని లోపాలనూ అంతే ఎండగట్టింది. విద్యుత్ రంగంలోనూ ప్రయివేటీకరణ... ప్రజలపై భారాలను ఇప్పటికే పెంచింది. మున్ముందు మరింత పెరగనుంది. భారాలు పెంచడమే కాదు, ప్రజల ఉపాధినీ హరించేలా పాలకుల విధానాలు సాగుతున్నాయి. ప్రభుత్వ చర్యలపై వ్యక్తమవుతున్న వ్యతిరేకతను తెలియజేయడంతో సరిపెట్టుకోక ఇలాంటి చర్యలకు ప్రభుత్వాలు ఎందుకోసం తలబడుతున్నాయో ప్రజాశక్తి తెలియచేస్తోంది. రైతులు, కార్మికులు, సేవారంగాల్లోని ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించడంలో, అవుట్‌సోర్సింగ్ పేర ప్రయివేటు కంపెనీలకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్న తీరును ఎండగట్టడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుంది. తన పిల్లల్ని తానే తినేసే పాములా ప్రభుత్వరంగ సంస్థలను పాలకులు మింగేస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటాలకు బాసటగా నిలుస్తోంది ప్రజాశక్తి. భూ సమస్యపై, ఇళ్ల స్థలాల కోసం పేదలు సాగించిన పోరాటాలకు అండగా నిలిచింది ప్రజాశక్తి. పంచగలిగిన, పట్టాలివ్వగలిగిన భూములు

సామాజిక సేవా కార్యక్రమాల్లో ...

ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనవంతు పాత్ర పోషిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు, కేరళ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజాశక్తి సిబ్బంది ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ప్రజలకు సాయపడ్డారు. గడప గడపకూ తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి, ప్రజాశక్తి వార్షికోత్సవాల సందర్భంగా ప్రజాశక్తి ఆధ్వర్యాన రక్తదాన, వైద్య శిబిరాలు, మండు వేసవిలో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు సబ్జెక్టు నిపుణులతో సదస్సులు... తదితర వాటిని నిర్వహించడం ప్రజాశక్తికి ఒక ప్రత్యేకత. వైద్య శిబిరాల నిర్వహణ కూడా ప్రజాశక్తి సేవా కార్యకలాపాల్లో ఒకటి.

ఇక్కడ ఉన్నాయి చూడండి అంటూ జిల్లాల వారీ చూపెట్టింది. ఇందిరమ్మ, ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకాల్లో జరిగిన అక్రమాలను సోదాహరణంగా ఎండగట్టింది. ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బతీసే చర్యలను బయటపెట్టింది. వలసలు, ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై ప్రత్యక్ష పరిశీలన జరిపి వాస్తవాలను పాఠకుల దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రపంచ దేశాల్లో ఆర్థిక రాజకీయ రంగాల్లో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు (మిగతా...5లో)















తేలుకుంచిలో విదేశీ పక్షుల కిలకిలలు


చెట్టుపై ఉన్న సైబీరియా పక్షులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సైబీరియా నుంచి సిక్కోలు.. దాదాపు 14 వేల కిలోమీటర్లు. ఈ మధ్యలో ఎన్నో దేశాలు.. ఎన్నెన్నో పర్వతాలు.... వాటన్నింటినీ దాటుకుని.. వేలాది పక్షులు జిల్లాకు చేరుకుంటాయి. మండలంలో తేలుకుంచికు చేరుకుని ఆవాసాలు ఏర్పర్చుకుంటాయి. ఇక్కడే సంతానోత్పత్తి చేస్తాయి. ఆపై వాటికి రెక్కలు వచ్చాక... వాటిని తమ వెంట స్వదేశానికి తీసుకుపోతాయి. ఈ క్రమంలో పర్యాటకులను ఆకర్షిస్తూ.. ఇక్కడి ప్రజలతో తెలియని అనుబంధం ఏర్పరచుకున్నాయి. అందుకే ఆ పక్షులను ఈ ప్రాంత ప్రజలు ఆడపడుచుల్లా. కన్నబిడ్డల్లా భావిస్తారు. పక్షుల రాకతో వర్షాలకు సూచికగా భావిస్తూ.. తమ పంటలు సుభిక్షంగా పండుతాయని సంబరపడుతుంటారు. అవి తిరిగి స్వదేశానికి వెళ్లిపోతుంటే బాధలో మునిగిపోతారు. వందేళ్లకు పైగా విదేశీ విహంగాలతో తెలుకుంచి వాసులకి కొనసాగుతున్న అనుబంధంపై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం. గ్రామస్తులతో వందేళ్లకుపైగా అనుబంధం పెనవేసుకున్న విదేశ విహంగుల కిలకిల రాగల విరాజిలుతోంది. ప్రజలను, పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రకృతి పరమైన రక్షణ కోసం. ఏ దేశాలు దాటి ఆంధ్రాలోని సమశీతోష్ణ మండలాలకు సైబీరియా దేశపు విహంగాలు తరలివస్తుంటాయి. ఈ క్రమంలో జిల్లాలో ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచిలో వేలాది సంఖ్యలో విదేశీ విహంగాలు వస్తాయి. దాదాపు 14 వేల కిలోమీటర్లు దూరంలోని సైబీరియా తీరం నుంచి తరలివస్తుంటాయి. ఈ గ్రామాల్లో ఆవాసాలు ఏర్పర్చుకుని సంతానోత్పత్తి చేస్తాయి. సుమారు ఆరు నెలలపాటు విడిది చేస్తాయి. పిల్లలు కొంచెం పెద్దవైన తర్వాత వాటితో సైబీరియా తీరానికి వెళ్లిపోతాయి. ఈ విహంగాలను విదేశీ పక్షులంటే తేలుకుంచి గ్రామస్తులు ఒప్పుకోరు. వాటి పుట్టుక ఇక్కడే కనుక అవి తేలుకుంచి పక్షులేనని వారి వాదన. అధికారులు మాత్రం వలస పక్షులు గానే గుర్తించారు.

విదేశీ విహంగాలు శాస్త్రీయ నామం ఓపెన్ బిల్ స్టార్క్ (నత్త గుట్ట కొంగలు). ఈ పక్షులను తేలుకుంచి గ్రామస్తులు తమ ఆడపడుచుల్లాగా భావిస్తుంటారు. గ్రామస్తులకు వాటితో విడదీయరాని అనుబంధం ఉంది. ఇవి తేలుకుంచి గ్రామానికి వందేళ్ల క్రితం నుంచి వస్తున్నాయి. గతంలో ఇతర గ్రామాల్లో చెట్ల పైన ఉండేవి. ఆ సమయంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైపోతుండేవి. దీంతో తేలుకుంచిలోనే ఆవాసం ఏర్పరచుకున్నాయి. ఏటా ఈ సీజన్‌లో పక్షులు తరలివచ్చి, నేరుగా చేరుకుని గ్రామంలోని చెట్లపైనే వాలుతుంటాయి. వీటి రాకతో మా గ్రామ ఆడపడుచులు వచ్చారనే భావంతో గ్రామస్తులు సంబరపడుతుంటారు. ఆ పక్షులు వస్తే.. వర్షాలు కురుస్తాయని.. పంట పొలాలు సుభిక్షంగా పండు తాయని వారి నమ్మకం. సకాలంలో పక్షులు గ్రామానికి చేరకపోతే ఇక్కడ ప్రజలు ఆందోళన పడుతుంటారు. అవి తిరిగి స్వదేశానికి వెళ్లిపోయినప్పుడు తెగ బాధపడుతూ విచారం వ్యక్తం చేస్తారు. పక్షులను వేటగాళ్ల బారి నుంచి గ్రామస్తులే రక్షిస్తుంటారు. పక్షులను గతంలో ఇతర గ్రామస్తులు వేటాడితే వారికి గుండుగీసి గ్రామంలో ఊరేగించేవారు. సొంత గ్రామ ప్రజలు వేటాడితే వారికి జరిమానా విధించేవారు. అందువల్లను పక్షులను వేటాడేందుకు ఎవరూ సాహసించడం లేదు. అటవీశాఖ అధికారులు మాత్రం పక్షుల రక్షణ కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చెయ్యకపోవడం వల్ల భారీగా ఈదురు గాలులు వచ్చినప్పుడు పక్షులు మృత్యవాత పడుతుంటుయి. విదేశ పక్షులు రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. గతంలో వాచ్ టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పి నేటి వరకు దాని జాడ లేదన్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా తేలుకుంచి విదేశ పక్షులు రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.










ప్రహరీ లేని క్రీడా మైదానం

నిర్లక్ష్యపు నీడలో

క్రీడా మైదానం

- ఆక్రమణలకు గురవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఇచ్ఛాపురం ప్రాంతానికి అతిపెద్ద. క్రీడలు మొదలుకుని రాజకీయ వేదికల వరకూ అన్ని అవసరాలను తీరుస్తుంది. ఒకప్పుడు ఈ మైదానం జాతీయస్థాయి క్రీడా పోటీలకు జిల్లాలోనే వేదికగా గుర్తింపు పొందింది. ఇక్కడే శిక్షణ ప్రారంభించి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదిగిన క్రీడాకారులెందరో ఉన్నారు. అంతటి గుర్తింపు ఉన్న ఈ మైదానం నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. హద్దులు దాటుతున్న ఆక్రమణలతో రోజురోజుకీ మైదానాన్ని ఇరుకున పెడుతున్నాయి. రాజా వారి మైదానంగా గుర్తింపు పొంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) దానంగా మారిన ప్రదేశం. ఎదురుగా టూరిజం పార్కు నిర్మాణం చేపట్టారు. ఇక జాతీయ రహదారికి, మైదానానికి మధ్య కొంత స్థలం ప్రయివేటు వ్యక్తుల ఆధీనంలో ఉంది. వారికున్న పరిమితిలో నిర్మాణాలు జరిపితే ఇబ్బంది లేదని, మైదానం ఆకారం మార్చేసేలా నిర్మాణాలు చేపడుతున్నారని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు వారి హద్దులను గుర్తిస్తే, ఆక్రమణలకు అవకాశం ఉండదని వారు అభిప్రాయపడుతున్నారు. గతంలో టిడిపి హయంలో రాష్ట్ర క్రీడలు, చిన్న తరహా పరిశ్రమలశాఖ మంత్రి తమ్మినేని సీతారాం చేతుల మీదుగా రూ.50 లక్షల నిధులతో మైదానాన్ని తీర్చిదిద్దేందుకు శంకుస్థాపన చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రతిపాదన కాస్త నీరుగారిపోయింది. ఈ మైదానం నుంచే మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మొదలకుని మాజీ సిఎంలు చంద్రబాబు, రాజశేఖరరెడ్డి తదితర నేతలు పలు సందేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ మైదానం ఆవరణలో ఓ వైపు వ్యాయామశాల, మరోవైపు రాజావారి సమాధులు ఉన్నాయి. దీనిని పరిరక్షించి విద్యార్థులకు అద్భుత సంపదను అందించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఎవరి భూ హక్కులకు భంగం కలి గించడం లేదని, మైదానాన్ని కాపాడు కోవాలన్న తపనతో ఉన్నామని వారంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్న కాలేజీ మైదాన కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు వస్తున్నారు... చూస్తున్నారు... కానీ, ఒక అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించాలని, క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.


ఉద్యోగాల కోసం సాధన చేస్తున్న నిరుద్యోగులు



వైద్య శిబిరంలో అందజేస్తున్న మందులు (ఫైల్)

ప్రజల పక్షాన అక్షర సమరం

(రెండో పేజీ తరువాయి)

పాఠకుల దృష్టికి తెస్తోంది. స్థానిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఇతర ప్రాంతాల్లో జరిగే ముఖ్యమైన అంశాలనూ వదిలివేసే విధానాన్ని ప్రజాశక్తి అనుసరించడం లేదు. ఇతర రాష్ట్రాల్లోని ముఖ్యమైన వార్తలనూ పాఠకులకు అందిస్తోంది.

లౌకిక విలువల పరిరక్షణలో...

లౌకిక విలువల పరిరక్షణ కోసం ప్రజాశక్తి సదా నిలబడింది. వ్యాసాలు, సంపాదకీయాలు, ప్రత్యేక సంచికల ద్వారా మతోన్మాదుల చర్యలను బహిర్గతం చేసింది. గుజరాత్‌లోనూ ఇతర రాష్ట్రాల్లోనూ మతోన్మాదులు సాగించిన మారణకాండ, దాని వెనక ఉన్న రాజకీయ లక్ష్యాలను వెల్లడించింది. గుజరాత్‌లో మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగిన నరమేధంపై కోర్టుల్లోనూ వెలుపలా పోరాటం చేస్తున్న ప్రముఖ సంఘసేవకురాలు, జర్నలిస్టు తీస్తా సెతల్వాద్‌ను రజతోత్సవాల ముగింపు సభకు ఆహ్వానించి ఆమె సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించింది. ప్రజాశక్తి 15వ వార్షికోత్సవానికి ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కాగా, 20వ వార్షికోత్సవంలో ప్రముఖ కవి హిందీ సినీ రచయిత జావేద్ అక్తర్ పాల్గొన్నారు. రజతోత్సవాలకు ప్రధాని మన్మోహన్‌సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హాజరయ్యారు.

సామాజిక న్యాయం కోసం...

సామాజిక న్యాయంపై కూడా ప్రజాశక్తి విశిష్ట పాత్రను నిర్వహిస్తూ వస్తోంది. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పడడానికి చాలా ముందే ప్రజాశక్తి రాష్ట్రవ్యాప్తంగా దళితులపై కొనసాగుతున్న వివక్ష... ప్రత్యక్షంగా, పరోక్షంగా కన్పించే అంటరానితనంపై సమగ్ర సర్వే నిర్వహించింది. సవివరమైన కథనాలను ప్రచురించింది. పున్నయ్య కమిషన్ ఏర్పడిన అనంతరం, తాను ప్రచురించిన వార్తల క్లిప్పింగ్‌లను కమిషన్‌కు సమర్పించింది. ప్రజాశక్తిలో వెల్లడించిన వాస్తవ పరిస్థితులను పున్నయ్య కమిషన్ అందచేసిన నివేదిక కూడా నిర్ధారించింది. పలు వృత్తులకు చెందిన వారిపై, మైనార్టీల స్థితిగతులపై ప్రజాశక్తి సమగ్ర సర్వేలు జరిపి వాస్తవాలను పాఠకుల ముందుంచింది. అణగారిన వర్గాలపై ఎక్కడ దాడి జరిగినా అక్కడ వాలిపోయి నిజానిజాలను వెలికితీసి ప్రజల ముందుంచుతోంది ప్రజాశక్తి.

మోటూరు హనుమంతరావు మృతి అనంతరం వి.శ్రీనివాసరావు, ఎస్.వినయ్ కుమార్, తెలకపల్లి రవి, పాటూరి రామయ్య, ఎం.వి.ఎస్ శర్మ సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బి.తులసీదాస్ సంపాదకునిగా ఉన్నారు. ప్రజాశక్తి వార పత్రిక కాలం నుంచి వి.ఆర్ బొమ్మారెడ్డి కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. కొరటాల సత్యనారాయణ తన చివరి శ్వాస వరకూ ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పలు విభాగాల్లో పనిచేస్తూ తమ జీవితాలను ప్రజాశక్తికి అంకితం చేసిన కామ్రేడ్స్ ఎందరో ఉన్నారు. వారందరూ స్ఫూర్తి ప్రదాతలు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే లక్ష్యంతో ప్రజాశక్తి ముందుకు సాగుతోంది.

యాజమాన్య పద్ధతులతో మేలైన కొబ్బరిసాగు

ప్రజాశక్తి - కవిటి

ఉద్దానం రైతుల ఆశాదీపం కొబ్బరిని చీడపీడలు చుట్టుముట్టేస్తుంటే ఎం చేయాలో తెలియని అయోమయ స్థితిలో కొబ్బరి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఓవైపు గ్యానోడెర్మా, మరోవైపు తెల్లదోమ. కనీసం కొత్త రకాలకు చెందిన మొక్కలు వేసి సాగు చేద్దామంటే ఎర్రముట్టి, నల్లముట్టి వంటి పురుగులు మొక్కలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు అవలంభించాలి.

కొమ్ముపురుగు

కొమ్ముపురుగు దృఢమైన రెక్కలు కలిగి పెంకు పురుగులా ఉంటుంది. దీని తలపై ఖడ్గ మృగం పోలిన కొమ్ము ఉండడంతో దీన్ని కొమ్ముపురుగు అని పిలుస్తారు.



గ్యానోదెర్మా సోకిన కొబ్బరి చెట్టు

లక్షణాలు

కొమ్ముపురుగు ఆశించిన మొక్కలు, చెట్లలో విప్పారని ముదురు ఆకులపై'వి' ఆకారంలో కత్తిరించి ఉంటుంది. కొబ్బరి చెట్టు మొవ్వులో పురుగు తొలిచిన రంధ్రం, పురుగు నమిలిన పిప్పి ఉంటుంది. ఈ పురుగు లేత మొవ్వు భాగమును, పొత్తులను తొలుచుట వల్ల విప్పారని లేత ఆకులు ఆకులు, పువ్వులు నష్టపోయి కొబ్బరి పంటలో దిగుబడులు తగ్గిపోతాయి. అలాగే చిన్న మొక్కలను ఈ పురుగు ఆశించడంతో మొవ్వు దెబ్బతిని మొక్కలు చెనిపోయే ప్రమాదముంది. అంతేకాకుండా ఈ పురుగు ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకి తిరిగినప్పుడు ఈ మొవ్వుకుళ్లు వ్యాధి వ్యాపిస్తుంది. ముఖ్యంగా ఈ కొమ్ముపురుగులు నష్టపరిచిన మొవ్వు భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు చెట్టుకి ఎర్రముక్కు పురుగు ఆశించి పూర్తిస్థాయిలో నష్టపరుస్తుంది.

సర్పిలాకార తెల్లదోమ లక్షణాలు

చెట్టు కొమ్మలు, ఆకులు అడుగు భాగంలో సర్పిలాకార వలయాలను ఏర్పరిస్తుంది. ఈ వలయాలకు తెల్లని మైనపు పూత పూయబడి ఉంటుంది. ఆకుల అడుగుభాగంలో తెల్లని దూదివంటి పదార్థం నిండి ఉంటుంది. తేనెవంటి జిగురు పదార్ధం ఆకుల అడుగు భాగం నుంచి కింది ఆకులపై ఏర్పడడంతో ఆకులు నల్లటి మసిరంగుతో నిండి ఉంటాయి. ఈ తెల్లదోమ ఆకుల కింది భాగాన్ని ఆశించి రసాన్ని పీల్చివేసి తేనెలాంటి జిగురు పదార్ధం విసర్జిస్తుంది. దీనివల్ల బూజు నల్లని మసిలా అభివృద్ధి చెందుతుంది. ఆకులపై ఏర్పడిన మసివల్ల కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

పసుపు రంగు కలిగిన జిగురు అట్టలను చెట్లకు కట్టడం ద్వారా తెల్లదోమలు అట్టకు అతుక్కుని చనిపోతాయి. ఎటువంటి క్రిమిసంహారక మందులను తోటలో పిచికారీ చేయకూడదు. దీనివల్ల మిత్రపురుగులు నశిస్తాయి. మసి రంగు నివారణకు ఒక శాతం గంజి ద్రావణాన్ని మసిబూజు ఆశించిన భాగాలపై పిచికారీ చేయాలి. పురుగుస్థాయి మరీ ఎక్కువ ఉంటే అజాడిరక్తిన్ 10.000 పిపిఎం 1ఎంఎల్, 0.5 శాతం వేపనూనెతో 10 గ్రాముల సర్ఫ్ పొడిని లీటర్ నీటిలో కలిపి ఆకులు అడుగుభాగంలో బాగా తడిసేలా పిచికారీ చేయాలి. ముఖ్యంగా ఈ తెల్లదోమను ఏంకార్సియా గద్వేలోపే (మిత్రపురుగులు) బదనికలు అదుపులో ఉంచుతాయి. ఈ పురుగును ప్రయోగశాలలో ఉత్పత్తి చేసే అవకాశం లేనందున సహజ సిద్ధమైన కొబ్బరి తోటల నుంచి సేకరించి బదనికలు లేని కొబ్బరి తోటల్లో విడుదల చేయాలి. ఈ బదనికలు దాదాపు 6 నుంచి 8 నెలల్లో తెల్లదోమను అదుపులోకి తీసుకొస్తాయి.

ఎర్రముక్కు పురుగు

ఎర్రముక్కు నష్టం చాలా తీవ్రస్థాయిలో ఉంటుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే తోటంతా చనిపోయే ప్రమాదముంది. 5 నుంచి 10 ఏళ్ల వయసు కలిగిన మొక్కలు ఈ పురుగు తాకిడికి ఎక్కువగా గురవుతాయి. ముఖ్యంగా అరటి అంతరపంటగా వేసిన తోటల్లో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా పడిపోయిన, కుళ్లిపోయిన చెట్లు, మొక్కలకు ఈ పురుగు ఆశించి శరవేగంగా తోటలో మొక్కలకు వ్యాపిస్తుంది. అంతేకాకుండా చెట్టుకి ఏవైనా పనిముట్లతో దెబ్బ తగిలినా, ట్రాక్టర్‌తో దున్నినప్పుడు నష్టం కలిగినా, కొమ్ముపురుగు ఆశించి రైతుకి తెలియని నష్టం జరుగుతుంది.

లక్షణాలు

ఈ పురుగు ఆశించిన చెట్లుకాని మొక్కలుకాని మధ్యవలయంలో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి, లేకుంటే ఎండిపోతాయి. కాండంపై రంధ్రాలు ఏర్పడి చిక్కటి ముదురు ఎరుపు రంగులో ద్రవం కారుతుంది. ఆ రంధ్రాల నుంచి పురుగు నమిలిన పిప్పు బయటకు వస్తుంది. అంతేకాకుండా పీచుతో పురుగులు చుట్టిన ఉండలు, నమిలిన పిప్పి ఆకు వలయాల్లో కానీ, చెట్టు మొదల్లో కానీ కనిపిస్తాయి. పురుగు ఆశించిన చెట్టు కాండంపై చెవి ఆణిస్తే లోపల లద్దె పురుగులు కాండం తినే శబ్ధం వినిపిస్తుంది. చెట్టు పాక్షికంగా దెబ్బతిన్నప్పుడు ఎదుగుదల తగ్గి కాపు ఆలస్యమవుతుంది. చెట్టు పూర్తిగా డొల్ల అయిపోయినప్పుడు చెట్టు చనిపోయి పడిపోతుంది.

నల్లముట్టె పురుగు

ఈ పురుగు అన్ని వయసు కొబ్బరి చెట్లను ఆశిస్తుంది. అడుగు వరుస ఆకుల్లో చేరి పత్రహరితం గోకి తింటుంది. రంపపుపొట్టు వంటి రెట్టలతో నోటి దారాలతో గూళ్లు కట్టి, ఆకులను అతికించి ఆ గూళ్లలో నివాసం ఉంటుంది.

లక్షణాలు

పురుగు ఆశించిన ఆకులపై ఎండిన మచ్చలు ఏర్పడతాయి. పురుగు తీవ్రత పెరిగినకొద్దీ మచ్చలన్నీ కలిసిపోతాయి. ఆకు మొత్తం ఎండిపోతుంది. తోట అంతా కాలిపోయినట్టు అయిపోతుంది. తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కాయలు కూడా దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.

యాజమాన్య పద్ధతులు

పురుగు ఆశించిన కింది వరుస ఆకులు కత్తిరించి కాల్చివేయాలి. నల్లముట్టి పురుగు ఆశించిన తోటల్లో గొనియోజస్ బదనికలు విడిచిపెట్టాలి. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సామూహికంగా నిర్వహించాలి. పైన చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సిఫార్సు చేయబడిన ఎరువులు చెట్టుకి కేజీ యూరియా, రెండు కేజీల ఎస్ఎస్‌పి, 2.5 కేజీల ఎంఒపి చెట్టుకి అందించాలి.





సేవకు చిరునామా రాజేష్

ప్రజాశక్తి– కవిటి

ఈసారి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆర్థికంగా, సామాజికంగా పట్టున్నన వ్యక్తిని బరిలో దించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలుస్తోంది. మొదటి నుంచీ నియోజకవర్గంలో జనసేనకు ఉన్న ఆదరణ, స్థానిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని ఎలాగైనా ఈసారి గెలుపు గుర్రాన్ని బరిలో దించాలని చూస్తున్నట్టు సమాచారం.

ఇటువంటి పరిస్థితుల్లో ఇచ్ఛాపురం జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ చాపకింద నీరులా విస్తరించుకుంటూ అందరి దృష్టి తనవైపు తిప్పుకుంటున్నారు. ఓవైపు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తునే ఆపద అంటే సరే పద అంటూ విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ.40 లక్షలకు పైగా ఆయన సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారంటే క్షేత్రస్థాయిలో ఆయన ఎంత బలంగా పనిచేస్తున్నారో అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ కూడా ఓవైపు సినిమాలు చేస్తూ ఎవరికి ఎటువంటి ఆపద ఉందని తెలిసినా వెంటనే స్పందించి తనవంతుగా సాయం చేస్తున్నారు. రాజేష్ కూడా అదే రీతిలో తన వ్యాపారాల ద్వారా వచ్చిన ఆదాయంలో అధిక శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తూ శభాష్ అనిపించుకున్నారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న రాజేష్ (ఫైల్)

ఇక ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన గెలవాలంటే ముందు బరిలో సరైన అభ్యర్థి నిలవాలనే వాదన బలంగా వినిపిస్తోంది. అందుకు అనుగుణంగానే నియోజకవర్గంలో వైసిపి, టిడిపి అభ్యర్థులకు ధీటైన అభ్యర్థిని బరిలోదించేందుకు జనసేన సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అయితే ఆ ధీటైన అభ్యర్థి లోళ్ల రాజేష్ అని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే రాజేష్ కుటుంబానికి మొదటి నుంచి స్థానికంగా ఉన్న ఆదరణ, ఎంతోమందికి వారు కల్పించిన ఉపాధి నేడు రాజేష్‌కు కొండంత అండగా నిలుస్తోంది. ఆ రోజుల్లో కనీసం తినేందుకు తిండిలేని సమయంలో రాజేష్ కుటుంబం ఆశ్రయం కల్పించిన కొన్ని వందల కుటుంబాలు నేడు రాజేష్ వెంట నడుస్తున్నాయి. అంతేకాకుండా వివాదాలకు దూరంగా ఉంటూ, వీలైనంత వరకూ నలుగురికీ ఉపయోగపడే తత్వం నేడు రాజేష్‌కు కలిసొచ్చింది. మాటలో స్పష్టత, మనిషిలో ప్రశాంతత విద్యాధికుడైన రాజేష్‌ను మిగతా వారికంటే భిన్నంగా నిలుపుతున్నాయి.

వాస్తవానికి 2009లోనే లోళ్ల రాజేష్‌ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా చూడాల్సిందని స్థానికులు, రాజేష్ అభిమానులు అంటున్నారు. ఎందుకంటే అప్పుడు ప్రజారాజ్యం పార్టీలో చురుకుగా పనిచేసిన లోళ్ల రాజేష్‌కే టిక్కెట్ వస్తుందనే అందరూ అనుకున్నారు. కానీ, చివరి నిమషంలో నర్తు శేషగిరికి టిక్కెట్ కేటాయించడం, శేషగిరి పరాజయం పొందడం జరిగింది. అదే సమయంలో రాజేష్‌కు టిక్కెట్ కేటాయించుంటే విజయం తథ్యమని, స్థానికంగా ఉన్న సమీకరణాల దృష్ట్యా అప్పుడు సాయిరాజ్‌కు విజయం దక్కేదికాదనేది వారు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. వాస్తవాలు పరిశీలిస్తే అదే నిజమని పరిశీలకులు కూడా అభిప్రాయ పడుతున్నారు. ఇక ఇప్పుడున్న పరిస్థితుల్లో అటు సాయిరాజ్, ఇటు ఎమ్మెల్యే అశోక్‌కు ధీటైన జనసేన అభ్యర్థి ఎవరంటే లోళ్ల రాజేష్ అనే స్థానికంగా సమాధానం వినిపిస్తోంది. ఎందుకంటే ఎంత జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తామన్నా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం తప్పనిసరి. అదే విధంగా స్థానికంగా ఉన్న సమీకరణాలు, ఆర్థిక, సామాజిక అంశాలు ప్రస్తుతం రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇటువంటి అంశాల దృష్ట్యా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా రాజేష్‌ను ప్రకటిస్తే 2024లో జనసేన అభ్యర్థుల గెలుపు రాజేష్‌తోనే మొదలవుతుందని స్థానికులు, ఆయన అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


పరామర్శిస్తున్న రాజేష్ (ఫైల్)

నాలుగేళ్లలో అభివృద్ధి శూన్యం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా పలాస నియోజకవర్గంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రశ్నించారు. ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తాను అధికారం వచ్చిన వెంటనే ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణానికి కృషి చేస్తానని అప్పలరాజు చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం మంత్రిగా పదవులు అనుభవిస్తున్నారే తప్ప తట్టెడు మట్టినే వేశారా? అని ప్రశ్నించారు. రివర్స్ పేరు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచడం, జిఒలు విడుదల చేస్తున్నరే తప్ప పనులు చేపట్టడం లేదన్నారు. ఆఫ్‌షోర్ పనులు చేయకపోవడంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. టిడిపి హయాంలో 50 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఆఫ్‌షోర్ నిర్వాసితుల కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాలనీలో స్కూల్ నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్కడ ఇప్పటికీ శ్మశాన వాటిక ఏర్పాటు చేయలేదని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో విస్తరణ పేరుతో దుకాణాలను ధ్వంసం చేశారని, మూడేళ్లు కావస్తున్నా విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. త్వరితగతిన పనులు చేయకపోవడంతో వ్యాపారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలువ పనుల్లో జాప్యంతో మున్సిపాలిటీలో పారిశుధ్యం లోపించిందని, పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస మండలం సూదికొండ, నెమలికొండ, మందస నల్లబుద్దులూరు కొండ మాయమైందని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా భూ ఆక్రమణదారులపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజుతోపాటు వైసిపి నాయకులు భూ ఆక్రమణలు చేస్తున్నారు తప్ప నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్‌కు మరలా అప్పలరాజు ఆర్భాటంగా శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా ఎందుకు పనులు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. తాత్కాలిక రైతుబజారును ఆర్భాటంగా ప్రారంభించిన వారం రోజులకే మూతపడిందన్నారు. వజ్రపుకొత్తూరు మండలం పూడిలంకలో టిడిపి హయాంలో ఉప్పుటేరు మీదగా 700 మీటర్ల రోడ్డు పనులు చేపడితే... మీ హయాంలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. నాలుగేళ్లుగా రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేస్తూ శివారు భూములకు వంశధార అందించారా? ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో వంశధార నీటిని శివారు భూములకు అందించామని చెప్పారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఎల్లప్పుడూ గౌతు కుటుంబానికి విమర్శించడం తప్ప నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు.


గౌతు శిరీష

కాలుష్య కోరల్లో ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలో పలు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు లు పుట్టుకొస్తున్నాయి. వాటి నియంత్రణ లేక కాలుష్య కోరల్లో చిక్కుకుని ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నియంత్రణ లేకపోవడంతో విచ్చల విడిగా ఏర్పాటైన ఇటుక బట్టీలు కనీస నిభందనలు పాటించడం లేదన ఆరోపణలు ఉన్నాయి. పట్టించుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇచ్ఛాపురం, రత్తకన్న, బెల్లుపడ, మశకపురం, బిర్లంగి, తోటూరు, హరిపురం, కొలిగాం, పయతరి, లొద్దపుట్టి, జగన్నాథపురం, ఈదూపురం గ్రామాల్లో దాదాపు 30కి పైగా ఇటుక పరిశ్రమలు ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి ప్రత్యేక ఇటుక తయారీ చేసే పని వారికి ముందస్తుగా అడ్వాన్స్ ఇచ్చి తెచ్చుకుంటారు. ఇటుక తయారీకి ఎక్కువగా బొగ్గు, ఊక వాడుతుంటారు. దాని ద్వారా వచ్చే అధికంగా పొగ, దుమ్ము, ధూళితో వస్తుండడంతో ఆయా పరిసరాలన్నీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. అలాగే రోడ్లపై రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో సమీప పంట పొలాల్లో ఇటుక బట్టిల నుంచి వెలువడే కాలుష్యం, ధూళి, పొగతో పంట సాగు తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలన్న నిబంధన ఉన్నా అనేక మంది ఇటుక బట్టి యజమానులు తుంగలోకి తొక్కివారు. తనిఖీ చేయాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటుక బట్టి పరిశ్రమలకు కనీసం రెండు నుంచి ఐదు ఎకరాలు వరకు వ్యవసాయ భూమీ అవసరం. ఇటుక బట్టీలకు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంత రుసుం చెల్లించాలి. ఇప్పటికైన ప్రజారోగ్య, రైతులకు చెందిన పంట పొలాలకు దెబ్బతినే ఇటుక బట్టీ పరిశ్రమలపై ముమ్మర తఖీలు చేపట్టి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఇచ్ఛాపురం సమీపంలో ఉన్న ఇటుక బట్టీ

సా...గుతున్న రోడ్డు విస్తరణ పనులు

ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

ప్రజాశక్తి- పలాస పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలి. జిల్లాలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకు ప్రత్యేక స్థానం కల్పించి అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలనే ఉద్దేశంతో ఇప్పటికప్పుడు మూడేళ్ల క్రితం ఆవేశంగా విస్తరణ పనులు చేపట్టేందుకు భవనాలు తొలగించారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి మూడేళ్లు కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. జంట పట్టణాలు మురుగు కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పెరిగిపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు నిధులు కొరత అయితే... మరోవైపు కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఆవేశంగా భవనాలు తొలగించిన మున్సిపాలిటీ అధికారులు ప్రస్తుతం విస్తరణ పనులు చేపట్టలేక పోతున్నారని పట్టణ ప్రజల నుంచి విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఏటా సంక్రాంతికి విస్తరణ పనులు పూర్తి చేసి కానుకగా ఇస్తామని ప్రతి సమావేశంలోనూ చెబుతుండటంతో పట్టణ ప్రజల్లో నమ్మకం పోయిందనే వాదన బలంగా వినిపిస్తోంది.

రూ.3.39 కోట్లు కేటాయింపు

మున్సిపాలిటీ పరిధిలోని విస్తరణ పనులకు 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.39 కోట్లతో విస్తరణ పనులు చేపడుతున్నారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వరకు రూ. 1.97 కోట్లు వ్యయంతో ఒక వైపు రెండు అడుగుల వెడల్పుతో మురుగు కాలువ నిర్మాణం, మరోవైపు మూడు అడుగుల వెడల్పుతో కాలువలో పాటు ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టనున్నారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఇందిరాగాంధీ కూడలి వరకు రూ.1.42 కోట్ల వ్యయంతో రెండు వైపులా కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాశీబుగ్గ కొంత ప్రాంతంలో రూ.75 లక్షలతో మూడు ఆడుగుల కాలువతో పాటు ఫుట్‌పాత్ నిర్మాణానికి నిధలు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

కల్వర్టులు పూర్తయ్యేనా...? పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో విస్తరణ పనులు చేపట్టి మూడేళ్లు కావస్తుండడంతో 75 శాతం కాలువ పనులు చేపట్టారు. చాలా వరకు కాలువలు నిర్మాణం చేపట్టారు కానీ కాలువలకు లింకులు కలపకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఆంధ్రా బ్యాంకు లైన్, సబ్ రిజిస్ట్రార్ లైన్, రాజకుమార్ ఆస్పత్రి లైన్, అప్పయ్యదొర విగ్రహం వద్ద ఇలా చాలా ప్రాంతాల్లో కాలువలు లింకులు కలపడం, కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. కానీ, పనులు త్వరితగతిన జరుగడం లేదనే వాదన బలంగా ఉంది.

పూర్తి కాని విద్యుత్ లైన్లు

ఇందిరాగాంధీ విగ్రహం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు రెండు వైపులా విద్యుత్ లైన్లు, రోడ్లు పై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డుకు అవతలి వైపు ఏర్పాటు చేసేందుకు రూ.89 లక్షలు ఖర్చు అవుతుందని మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా స్తంభాలు వేసి లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాగే మరో వారం రోజులు పాటు పనిచేసిన విద్యుత్ లైన్లు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. విద్యుత్ లైన్లు ఏర్పాటు కోసం రోజూ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నడిచి వెళ్లేందుకు వేసుకున్న చెక్క మెట్లు

అరకొరగా ఫుట్‌పాత్ నిర్మాణం

రోడ్డు ఇరువైపులా కాలువలు నిర్మించి అరకొరగా ఫుట్‌పాత్‌పై పలకలు వేసి చేతులు దులుపుకున్నారు. కొంతమంది వ్యాపారులు కాలువలపై వ్యాపారులు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు నిర్మించి విడిచి పెట్టడంతో ఆ ప్రాంతంలో ఉన్న వ్యాపారులు కలిసి చందాలు వేసుకుంటూ కాలువపై పలకలు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలువలు నిర్మించి వెంటనే పలకలు వేసి ఫుట్‌పాత్ నిర్మాణం చేయాల్సి ఉండగా... ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కాలువలపై పలకలు లేకపోవడంతో చెక్కలతో నడిచి వెళ్లేందుకు వీలుగా నడక బాటలు వేసుకోవాల్సిన పరిస్థితి. ప్రమాదమని తెలిసినా సరి పరిస్థితుల్లో చెక్కలతో తయారు చేసిన నడకబాటలను వేసుకుంటున్నామని చెబుతున్నారు.



పలకలు లేని కాలువ

వర్షం పడితే అంతే...

విస్తరణ పనులు మందకొడిగా సాగడంతో పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే కాలువల్లో ఉన్న మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించడంతో పట్టణ ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. ఇదిలా ఉండగా కెటి రోడ్డు పొడవునా తారు ఊడి రాళ్లు తేలిపోతున్నాయి. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో ప్రయాణం చేయడం కష్టంగా ఉందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విస్తరణ పనులు పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై మున్సిపల్ ఎఇ అవినాష్‌ను వివరణ కోరగా, ఇప్పటి వరకు 75 శాతం పనులు చేపట్టామన్నారు. కాంట్రాక్టరుకు రూ.80 లక్షల వరకు బిల్లు చెల్లించామని అన్నారు. విద్యుత్ లైన్లకు సంబంధించి రూ.36 లక్షలు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల అయినా వెంటనే బిల్లులు చెల్లిస్తాం. త్వరలో పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు.


కొబ్బరి, జీడికి ఆశించిన తెగుళ్లు

కుంగదీస్తున్న ప్రకృతి విపత్తులు


తుపానుకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)

- వెంటాడుతున్న చీడపీడలు
- దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు
- పెరిగిన వలసలు.. తరిగిన కమతాలు

ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు ఓవైపు గిలగిలా కొట్టుకుంటుంటే, అదే పంటతో వ్యాపారం చేస్తున్న దళారీలు, వ్యాపారులు దర్జాగా బతికేస్తున్నారు. దీంతో రోజురోజుకు 'సాయం' కరువవుతున్న వ్యవసాయంలో కొట్టుమిట్టాడుతున్న రైతన్న గత్యంతరం లేని పరిస్థితుల్లో పోరుబాట పడుతున్నాడు. తాను పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, భవిష్యత్‌లో తనకి వ్యవ'సాయం' కావాలని దీక్షలు చేపడుతున్నాడు. రైతే రాజు అన్న నానుడి పోయి అయ్యో రైతన్న అనే ప్రస్తుత పరిస్థితికి తలా పాపం తిలా పిడికెడు అన్నట్టు ఓవైపు కుంగదీస్తున్న ప్రకృతి విపత్తులు, మరోవైపు వెంటాడుతున్న చీడపీడలకు తోడు నిలువునా దోచుకుంటున్న దళారీలు, వ్యాపారులకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాలు కారణమవుతున్నాయి.

సమస్యల తోరణం.. సముద్ర తీరం

జిల్లాలో సుదీర్ఘంగా ఉన్న సముద్ర తీరం రైతాంగానికి సమస్యల తోరణంగా మారుతోంది. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్‌తో ప్రారంభమైన ఈ సమస్యల జడివాన 2014 హుదూద్, 2018 తిత్లీ తుపాన్లతో తారాస్థాయికి చేరుకుంది. ఈ విపత్తుల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యానవన పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కొన్ని వేల కొబ్బరి, జీడి చెట్లు నేలకొరిగి పచ్చటి పుడమి తల్లి భోరుమంది. ముఖ్యంగా ఎంతో ప్రసిద్ధి కలిగిన ఉద్దానం కొబ్బరి, జీడి రైతులు ఈ తుపాన్లతో భారీగా నష్టపోయారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో తుపాను ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే జిల్లాలో అధిక ప్రాంతం ఒడిశాకి ఆనుకుని ఉండడంతో తుపాను ఆ ప్రాంతంలో తాకినా... దాని ప్రభావం జిల్లాపై స్పష్టంగా ఉండడంతో రైతులు భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. దీంతో ఏటా అల్పపీడనం ఏర్పడిందంటేనే జిల్లా రైతాంగం గుండెల్లో రైళ్లు పరిగెడుతూ ఉంటాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆ సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు.

దళారులను అరికట్టేవారు కరువు

ఇన్ని బాధలుపడి ఏదో విధంగా పంట పండిస్తే దానికి సరైన గిట్టుబాటు ధర లేక సరైన సమయానికి పంట కొనుగోలు చేయక ఇటు దళారులు అటు వ్యాపారులు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. మార్కెట్లో గిరాకీ లేదని వ్యాపారులు, వ్యాపారులు తీసుకోవడం లేదని దళారీలు రైతులతో చెడుగుడు ఆడుకుంటున్నారు. జిల్లాలో పండిస్తున్న కొబ్బరికి కానీ, జీడికి కానీ మార్కెట్లో ఎటువంటి గిరాకీ ఉందో అందరికీ తెలిసిందే. అందులో ఉద్దానం పంట అనగానే మరింత ప్రత్యేకమైనదిగా వినియోగదారులు మక్కువ చూపిస్తారు. వీటన్నింటినీ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు మాత్రం నేను, నా కుటుంబం అన్న చందంగా అంతా తమకే కావాలంటూ రైతు నెత్తిన చేయి పెడుతున్నాడు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ గత మూడు నెలలుగా జీడి మద్దతు ధర కోసం రైతులు చేస్తున్న పోరాటమే. మరోపక్క రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి రైతులకు అండగా నిలవాల్సిన నాయకులు, ప్రభుత్వాలు వ్యాపారులకే వత్తాసు పలుకుతూ రైతులకు మొండిచేయి చూపిస్తున్నారు. వెరసి ఈ కార్పొరేట్ పాలకుల కుళ్లు రాజకీయాలకు ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నల జీవితాలు దోపిడీకి గురవుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతన్న పోరుబాట పడుతున్నాడు.

అప్పులపాలవుతున్న రైతాంగం

ఇటువంటి పరిస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక, ఉన్న భూమిని అమ్ముకుని కొందరు ఒడ్డుకు చేరుకుంటుంటే, మరికొందరు ఉపాధి కోసం వలస పోతున్నారు. ముఖ్యంగా ఓ వైపు చేసిన అప్పులు, మరోవైపు పెరిగిన జీవన వ్యయం, తరిగిన ఆదాయంతో చిన్న, సన్నకారు రైతులు రియల్టర్లను ఆశ్రయిస్తుంటే పచ్చని తోటలు ఫ్లాట్లుగా మారి పచ్చదనం పోయి పర్యావరణం దెబ్బతింటోంది. కమతాలు కుదించుకుపోయి వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో కడలిలో అలజడులు చెలరేగి తరచుగా తుపాన్లు సంభవిస్తున్నాయి. మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పులతో అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి తాండవిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో చేతిలో ఉన్నది విడిచిపెట్టలేక మరోపని చేతకాక 'సాయం' అందని వ్యవసాయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

దయనీయస్థితిలో జీవితాలు

ఇటువంటి సమస్యల నడుమ ఉన్న కమతాలు సాగుచేయలేక కుటుంబాలను పెంచి పోషించలేక రైతన్నల జీవితాలు దయనీయస్థితిలో ఉన్నాయి. కూతురు పెళ్లి చేయాలంటే షావుకారి ఏ ముక్క రాయమంటాడో అని భయం, వ్యవ'సాయం' చేస్తున్న కొడుక్కి సంబంధం చూద్దామంటే సాఫ్ట్‌వేర్ ఎందుకు నేర్పించలేదంటారేమో ఆందోళన. పిల్లాడికి ఎల్‌కెజిలో చేర్పిద్దామంటే ఎన్ని వేలు అడుగుతారో అన్న అనుమానం. పాపకి పై చదువులు చెప్పిద్దామంటే ఎన్ని పైసలు అడుగుతారో అన్న ఆలోచనలతో రైతుల కుటుంబాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయి. చాలా సందర్భాల్లో ఈ సమస్యలు తీవ్రమై రైతు ఆయుష్షునే బలితీసుకుంటున్నాయి. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా పంట పండినా కడుపు నిండక, కమతం అమ్మినిదే కష్టం తీరదన్నట్టు ప్రస్తుతం రైతుల పరిస్థితి ఏర్పడింది. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు అన్నట్టు తన కష్టానికి ప్రతిఫలం, భవిష్యత్ రైతాంగానికి భరోసా కల్పించేందుకు ప్రస్తుతం రైతు పోరాడుతున్నాడు.


జీడి పిక్కలను ఎండబెడుతున్న కార్మికులు

సంక్షోభంలో జీడి రైతు

- పప్పుకు రెక్కలు... పిక్కలు నేలచూపు
- విదేశీ పిక్కల దిగుమతితో ముఖం చాటేస్తున్న స్థానిక వ్యాపారులు
- మద్దతు ధరకు జీడి రైతుల పోరాటం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఎంతో పేరుగాంచిన ఉద్దానం జీడి పంట నేడు ఒడిదిడుకులను ఎదుర్కొంటుంది. ఈ ఏడాది జీడి పంట దిగుబడి బాగా ఉండటంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గిట్టుబాటు ధర లేక రైతుల రోడ్డు ఎక్కే పరిస్థితి దాపురించింది. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో సుమారు 60,200 ఎకరాల్లో జీడి సాగవుతుంది. అందులో అత్యధికంగా ఉద్దానం ప్రాంతంలో 37,500 ఎకరల్లో పంట సాగు అవుతుంది. కొత్తూరు, రణస్థలం, ఆమదాల వలస, లావేరు, మెలియాపుట్టి తదితర మండల్లోనూ పండిస్తున్నారు. ఈ పంటను దాదాపుగా 2.5 లక్షల మంది రైతులు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతుండగా,. మరో మూడున్నర లక్ష మంది కార్మికులు వ్యాపారులు జీడి ఆదరిత పరిశ్రమపై ఆధారపడి పరోక్షంగా బతుకుతున్నారు.

గతేడాది కన్న ధరలు పడిపోవడంతో మద్దతు ధర సాధించడానికి రైతులు పోరాటాలకు సిద్ధమయ్యారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జీడి రైతులు జీపు జాతాలు, సమావేశాలు నిర్వహించడం, వ్యాపార సంఘాలతో చర్చలు జరిపారు. అయినా ఫలితం లేకపోవడంతో సత్యాగ్రహ దీక్షకు దిగారు. 80 కిలోల జీడి పిక్కల బస్తా కు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఎండనక, వాననక చెట్టు చెట్టూ తిరిగి, కొమ్మ కొమ్మకు పండిన పిక్క పిక్క ఎరి వాటిని నాణ్యమైన రీతిలో ఎండబెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తే వ్యాపారులు, దళారులు రైతులను నిలువునా ముంచేసున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు లేక ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించకపోవడంతో ప్రతి ఏడాది జీడి రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

ధరల స్థితిగతులు

2014లో 80 కిలోల జీడిపప్పు గరిష్టంగా రూ.14 వేలు వరకు ధర పరికినట్లు వ్యాపారులు చెబుతున్నారు. హుదూద్, తిత్లీ తుపాన్ల అనంతరం జీడి పంట తగ్గడంతో ధర రూ.పది నుంచి రూ.11 వేలు మధ్య వరకు పలికింది. ఈ ఏడాది రూ.7,800 నుంచి రూ.8 వేల మధ్య ధర పలుకుతుంది. ఇదిలా ఉండగా జీడిపప్పు ధర హోల్‌సేల్ మార్కెట్‌లో నంబరు వన్ పప్పు కిలో రూ.600 వరకు ఉంది. గతేడాది ఇదే పప్పు కిలో రూ.750 వరకు ధర పలికింది అని వ్యాపారాలు చెబుతున్నారు. రిటైల్ మార్కెట్‌లో ధర కాస్తా ఎక్కువగానే ఉంది. స్థానిక పప్పు దిగుబడి 25 కిలోల వరకు ఉంటుంది. ఉద్యాన పంటలకు చిరునామాగా ఉద్దానం మారుతుంది. వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలను కలిపి ఉద్దానంగా పిలుస్తారు. ఈ ప్రాంతంలో కొబ్బరి, జీడి, మామిడి చెట్లు కళకళలాడుతూ కనిపిస్తుంటాయి. జిల్లాలోని అత్యధికంగా ఇక్కడ జీడి పంట సాగవుతోంది. లక్షలాది మంది రైతులు, కార్మికులు, జీడి వ్యాపారులు, జీడిపప్పు తయారీ దారులు ఈ పంటను నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నారు. తెల్ల బంగారంగా చెప్పుకునే పలాస జీడిపప్పు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గుర్తింపు ఉండటంతో రైతులు జీడి పంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

దిగుబడి పెరిగింది... ధర తగ్గింది



తుపాన్లు అనంతరం ఈ ఏడాది దిగుబడి పెరిగింది. ధర మాత్రం నిలకడగా లేదు. జిల్లాలో 46,763 ఎకరాల్లో పంట సాగు చేయగా ఎకరాకు 450 నుంచి రూ.500 కిలోలు వరకు దిగుబడి వచ్చింది. ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- సునీత, ఉద్యానవన శాఖ అధికారి

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. పంట బాగా పండిన సమయంలో ధరలు లేకపోవడం రైతులను బాధిస్తుంది. నిల్వ చేసుకుని సామర్థ్యం లేక తక్కువ ధరలకు దళారులకు అమ్ముకొనే పరిస్థితి వస్తుంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- అర్జి నీలాచలం, జీడి రైతు, పెద్దమురహరిపూరం

జీడి ఉద్యమం ఉధృతం

పలాస : జీడి రైతులకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తమ బాధను ఎవరికి వెలబుచ్చులో తెలియక సతమతమవుతున్న తరుణంలో జీడి రైతులు ఏకమై జీడి రైతు సంఘం ఏర్పాటు చేశారు. ముందుగా విశాఖపట్నం కేంద్రంలో మార్చి 28న ఐదు జిల్లాల రైతు సంఘం నాయకులు చర్చించి ప్రతి జిల్లాలో జీడి రైతు సంఘం ఏర్పాటు చేసి ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఏప్రిల్ 23న జీడి రైతులతో సదస్సు, మే 24న జీడి రైతు సంఘాల నాయకులు, వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ సమయంలోనే జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మే 29న సచివాలయాలు వద్ద నిరసనలతో ప్రారంభమై కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న జీడి రైతులను ఏకం చేసేందుకు కవిటి మండలం నుంచి జులై 14 నుంచి 18 వరకు జీపుజాతా నిర్వహించి కాశీబుగ్గ సంత మైదానంలో మహా ధర్నా నిర్వహించారు. ఆ ధర్నాకు ఎపి రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి.తులసీదాస్ పాల్గొన్నారు. జూలై 28 నుంచి 29 వరకు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద 24 గంటల పాటు సత్యాగ్రహం దీక్ష చేపట్టారు. రోజురోజుకూజీడి ఉద్యమం ఉధృత బాట పట్టడంతో ఆగస్టు 5 నుంచి 20 వరకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.


మహాధర్నాలో మాట్లాడుతున్న సూర్యనారాయణ (ఫైల్)

తూతూమంత్రంగా సమావేశం

జీడి మద్దతు ధర కల్పించాలని ఒకవైపు రైతులు ఉద్యమ బాట పడుతుంటే... మరోవైపు వ్యాపారులు జీడి పప్పు ధర తగ్గిపోయింది. సుమారు 14 రోజుల పాటు జీడి పరిశ్రమలు బంద్ చేశారు. దీనిపై స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు అటు రైతులతో, ఇటు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సమస్య పరిష్కరించగా ఉండగా... కేవలం కంటితుడుపు చర్యగా జూలై 19న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సమీక్షంలో జీడి వ్యాపారుల సంఘం నాయకులు, మరోవైపు వేల సంఖ్యలో రైతులను పిలిపించి 80 కేజీల బస్తాకు రూ.9 వేలుకు కొనుగోలు చేయాలని ప్రతిపాదన పెట్టి చేతులు దులుపుకున్నట్లు రైతులు వాపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. సమావేశం నిర్వహించి నేటికీ 12 రోజులు కావస్తున్నా అతీగతీ లేని పరిస్థితి. ఏదేమనప్పటికీ జీడి రైతుల ఉద్యమం కొనసాగుతున్న పాలకుల్లో చలనం లేకపోవడం రైతుల పాలిట శాపం గా మారింది. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజుతో పాటు స్పీకర్ తమ్మినేని సీతారాం స్పందిస్తారేమో వేచి చూడాలి.

సమన్వయంతో ముందుకు

ఎమ్మెల్సీ నర్తు రామారావు



ప్రజాశక్తి- కవిటి

2024 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపిని అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని, అంతేకాకుండా జిల్లాలో ఎంపీ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ వైసిపి విజయ ఢంకామోగించడం ఖాయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు జోస్యం చెప్పారు. 'ప్రజాశక్తి' 43వ వార్షికోత్సవం సందర్భంగా తన రాజకీయ జీవితంలో అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలు పంచుకున్నారు.

మొదట్నుంచీ కాంగ్రెస్‌వాది అయిన మీకు వైసిపితో ఎలా జత కలిసింది?

నా రాజకీయ జీవితమే కాంగ్రెస్ పార్టీతో ముడిపడి ఉంది. అందులోనూ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అందరికీ న్యాయం చేశాం. గ్రామగ్రామాన అర్హులైన అందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తూ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాం. రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాతా నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. తరువాత జగన్మోహన్‌రెడ్డి వైసిపికిలోకి ఆహ్వానించారు. దీంతో 75 మంది సర్పంచ్‌లతో వైసిపిలో చేరడం, 2014లో వైసిపి టిక్కెట్టుపై పోటీ చేశాను.

యాదవుల సహకారం ఎలా ఉంది?

స్వాతంత్రం వచ్చిన తరువాత ఒక యాదవులకు చెందిన వ్యక్తికి చట్టసభల్లో అవకాశం కల్పించింది వైసిపి ప్రభుత్వమే. కార్పొరేషన్ పదవులు, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి అన్ని విభాగాల్లో వైసిపి ఇచ్చిన ప్రాధాన్యత గతంలో ఏ పార్టీలో దక్కలేదు. కచ్చితంగా జిల్లాలోని యాదవుల మద్దతు ఉంటుంది. ఎందుకంటే నాకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించిన తరువాత కావాలనే నాపై పోటీ పెట్టారు. అయితే నన్ను ఆదరించిన మంత్రులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు నాకు మంచి మెజారిటీతో విజయం అందించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని యాదవలు వైసిపికి అనుకూలంగా ఉండడం తప్పులేదు.

వైసిపి బలోపేతానికి చేస్తున్న కృషి ఏమిటి?

నేను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాని, వైసిపిలో చేరిన తర్వాత కానీ ఎప్పుడూ మొదటగా పార్టీ విధేయుడిని. అధిష్టానం నిర్ణయానికి వ్యతిరేకంగా ఏ రోజూ పనిచేయలేదు. అందుకు గుర్తింపే ఈ ఎమ్మెల్సీ పదవి. పార్టీని బలోపేతం చేయడం, విజయం సాధించడం కోసం సామాన్య కార్యకర్తగా పనిచేస్తాను. ఇక 2014లో నేను పోటీ చేసి ఓడిపోయాను అంటే అప్పటికి టిడిపి తరఫున పోటీ చేసిన వ్యక్తికి సానుభూతి ఓట్లు కలవడం, మొదట్నుంచి నియోజకవర్గంలో ఆ పార్టీకి ఉన్న కొంతమేర ఆదరణ కలిసి వచ్చింది. 2019లో అయితే అప్పటికే నలుగురైదుగురు సమన్వయకర్తలను మార్చడం, నియోకవర్గస్థాయిలో స్పష్టత లేకపోవడం పార్టీ విజయంపై ప్రభావం చూపించింది. ఒకసారి మనం వాస్తవాలు గమనిస్తే నియోజకవర్గంలో పది పదిహేను వేల ఓటు బ్యాంకు ఉన్న పార్టీ నేడు 60, 70 వేలకు చేరుకుందంటే అందులో నా కఠోర శ్రమ దాగి ఉంది. ఎవరెన్ని అనుకున్నా ప్రతి గ్రామంలో నర్తు రామారావుని ఆదరించేవారు, అభిమానించేవారు ఉన్నారు.

కలిసి పనిచేయడం లేదనే ప్రచారం వినిపిస్తోంది?

అది ప్రజల నుంచి వచ్చినది కాదు, కేవలం వైసిపి అంటే గిట్టనివాళ్లు చేసిన అవాస్తవ ఆరోపణ. ఎందుకంటే మా మధ్య సఖ్యత లేకపోతే 2019లో వైసిపికి 70 వేల వరకు ఓట్లు ఎలా వస్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంపై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత పదవులు కేటాయించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎలాగైనా ఇచ్ఛాపురంలో గెలుపే లక్ష్యంగా మేమంతా కష్టపడి పనిచేస్తున్నాం. అటు జెడ్‌పి చైర్‌పర్సన్, ఇటు నియోజకవర్గ సమన్వ యకర్త, మరోవైపు నేను, ఇంకోవైపు కార్పొరేష న్ పదవుల్లో ఉన్నవారు కలిసికట్టుగా పనిచేస్తూ ఇంటింటికీ తిరుగుతున్నాం. ఇది చూసి తమకు ఇక ఓటమి తప్పదేమో అని భయంతో కొంతమంది ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు.

మరిచిపోలేని ముఖ్యమైన సంఘటన?

నేను నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నప్పుడు ఒంటూరు, కళింగపట్నం బ్రిడ్జిల నిర్మాణం జరిగింది. అందులో ముఖ్యంగా కళింగపట్నం బ్రిడ్జి చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఆ గ్రామానికి వెళ్లాలంటే నీటిలో నాటుబండి మీద వెళ్లాల్సిందే. నేనూ నాలుగైదుసార్లు నాటుబండిపై ఆ గ్రామానికి వెళ్లాను. మనకి స్వతంత్ర్యం వచ్చిన తరువాతా ఇంకా ఇటువంటి గ్రామాలు ఉన్నాయా? అని నా మనసు చలించిపోయింది. వెంటనే అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్న ధర్మాన ప్రసాదరావునికలిసి ఆ గ్రామస్తులు దయనీయ పరిస్థితిని వివరించి బ్రిడ్జి మంజూరు చేయించాను. ఆ బ్రిడ్జి శంకుస్థాపన, ప్రారంభోత్సవం రెండు ధర్మాన ప్రసాదరావుతోనే చేయించాను. మనసు చలించి పోయి ఒక దీక్షతో కళింగపట్నం బ్రిడ్జి పూర్తయింది. అది నాకు మరిచిపోలేని మధురానుభూతి.

మీ భవిష్యత్తు ప్రణాళికలు ఏమిటి?

మొట్టమొదటిది, ముఖ్యమైనది రాబోయే ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో వైసిపి అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వడం. దీనికోసం అందరం సమిష్టిగా కష్టపడుతున్నాం. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాము. అప్పుడు చేసిన పొరపాట్లు మళ్లీ చేయకుండా విజయానికి అవసరమైన అన్ని అస్త్ర శాస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాం. అలాగే ఇచ్ఛాపురం నియోజకవర్గమే కాకుండా ఈ మూడు జిల్లాల్లో నాకు అవకాశమున్నంత వరకు మంచి కార్యక్రమాలు చేపట్టి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను.